RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 2 సంచిక : 316 మేడ్చల్ మల్కాజ్‌గిరి 7 డిసెంబర్ 2024 శనివారం పేజీలు : 4

## భారత సరిహద్దుల్లో బంగ్లాదేశ్ డ్రోన్స్...

భారత్, బంగ్లాదేశ్ దేశాల మధ్య ఉద్రిక్త పరిస్థితులు క్రమంగా పెరుగుతున్నాయి. అందుకు బంగ్లాదేశ్ ఆర్మీ పశ్చిమ బెంగాల్ సరిహద్దుల్లో బైరక్టార్ TB-2 కిల్లర్ డ్రోన్‌ను మోహరించడమేనని చెప్పవచ్చు. బంగ్లాదేశ్ ఆర్మీ మోహరింపుతో ఆ ప్రాంతంలో ఉద్రిక్తత పెరిగింది. ఈ ప్రాంతం భారతదేశంలో చాలా సున్నితమైనదిగా పరిగణించబడుతుంది. టర్కియే TB-2 డ్రోన్ చాలా శక్తివంతమైనది. ఇది దాడి చేయడమే కాకుండా, గూఢచర్యం చేయడంలో కూడా సహాయపడుతుంది. దీంతో ఇరు దేశాల మధ్య పరిస్థితులు వేగంగా మారుతున్నాయి. ఈ డ్రోన్‌లను బంగ్లాదేశ్‌లో 67వ సైన్యం నిఘా కార్యకలాపాల కోసం వినియోగిస్తున్నారని చెబుతున్నారు. బంగ్లాదేశ్ రక్షణ అవసరాల కోసం మోహరింపు అని చెప్పినప్పటికీ, ఆధునాతన డ్రోన్‌లను సున్నితమైన ప్రాంతంలో ఉంచడం ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారింది.




# రాష్ట్రంలో పొలిటికల్ హీట్..

## పోటాపోటీగా ఆ మూడు పార్టీల యాక్షన్ ప్లాన్స్!

## రేవంత్ పాలనకు నేటితో ఏడాది పూర్తి!

హైదరాబాద్ : తెలంగాణలో ఇప్పట్లో ఎన్నికలు లేకున్నా మూడు ప్రధాన పార్టీల మధ్య ట్రయాంగిల్ ఫైట్ నెలకొన్నది. ఓ వైపు రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరి ఏడాది పాలన పూర్తయిన సందర్భంగా రేవంత్ సర్కార్ ప్రజావిజయోత్సవాలను నిర్వహిస్తుండగా.. ప్రతిపక్ష పార్టీలైన బీజేపీ, బీఆర్ఎస్‌లు మాత్రం ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపడానికి ప్రయత్నిస్తున్నాయి. ఒక్కో పార్టీ ఒక్కో రకమైన కార్యక్రమాలతో ముందుకు సాగుతున్నది. ఆరోపణలు, ప్రత్యారోపణలు, విమర్శలు, ప్రతి విమర్శలతో రాష్ట్ర రాజకీయం ఒక్కసారిగా వేడెక్కింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఈనెల 7వ తేదీ (శనివారం) నాటికి ఏడాది పూర్తి అవుతుంది. దీంతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన ప్రజా విజయోత్సవాల పేరిట (నవంబర్14 నుంచి డిసెంబర్ 9 వరకు) కార్యక్రమాలను నిర్వహిస్తోంది. బహిరంగ సభలు, సమావేశాలు నిర్వహిస్తుంది. ప్రారంభోత్సవాలు, శంకుస్థాపన, ఉద్యోగ అపాయింట్‌మెంట్ లెటర్లను అందిస్తూ ముందుకు సాగుతోంది. రాష్ట్ర వ్యాప్తంగా ఈ విజయోత్సవాలు జరుగుతుండగా, వీటిని విజయవంతం చేయడానికి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎప్పటికప్పుడు మార్గదర్శకాలు జారీ చేస్తున్నారు. జిల్లాల్లో నిర్వహించే భారీ బహిరంగ సభలు, సమావేశాల విజయవంతం, ప్రజల్లోకి కాంగ్రెస్ ఏడాది పాలన ఫలితాలను ప్రజల్లోకి తీసుకవెళ్లడానికి రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాలకు ఒకరి చొప్పున పరిశీలకులను పార్టీ పరంగా నియమించారు.

ప్రభుత్వం చేస్తున్న కార్యక్రమాలను విజయవంతం చేయడానికి పార్టీ వర్గాలు ప్రయత్ని స్తున్నాయి. ప్రభుత్వం చేసిన మంచి పనులను ప్రజల్లోకి, పార్టీ శ్రేణుల్లోకి తీసుకవెళ్తున్నారు.

**బీఆర్ఎస్ చార్జిషీట్లు..** మరోవైపు బీఆర్ఎస్ అధికార కాంగ్రెస్ పార్టీ వైఫల్యాలపై తీవ్ర స్థాయిలో ఆరోపణలు చేస్తుంది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 10 రోజులు గడవక ముందు నుంచే గులాబీ పార్టీ తీవ్ర స్థాయిలో ఆరోపణలు చేస్తూ వస్తున్న విషయం తెలిసిందే. ఇక 100 రోజుల పాలన తర్వాత విమర్శలు మరింత పదునెక్కాయి. తాజాగా ఈనెల 7వ తేదీన కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరుపై చార్జిషీట్‌ను దాఖలు చేయాలని ఆ పార్టీ నిర్ణయించింది. ఇందులో ప్రభుత్వ వైఫల్యాన్నింటినీ ప్రజలకు వివరించనున్నారు. దీని కోసం ఎప్పటి నుంచో కసరత్తు చేస్తున్నారు. అందుకోసం ఓ షార్ట్‌ఫిల్మ్‌ను కూడా రూపొందించారు. దాన్ని కూడా ప్రదర్శించనున్నారు. సోషల్‌మీడియా ద్వారా ప్రభుత్వంపై దాడిని తీవ్రతరం చేయనున్నట్లు తెలుస్తోంది. కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయం తామేనని, బీజేపీ కాదనే విషయాన్ని చెప్పడానికి బీఆర్ఎస్ నేతలు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. అందుకే ఆ నేతలు అరెస్ట్‌లకు సైతం వెనకాడటంలేదు. ప్రజల్లో తాము ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడుతున్నామనే భావన కల్పించి రాజకీయంగా తామే బలమైన ప్రత్యర్థిగా చెప్పుకోవడానికి యత్నిస్తున్నారు. అందుకు కాంగ్రెస్ ఏడాది పాలనను వినియోగించుకోవాలని చూస్తున్నారు.

**7న రాష్ట్రానికి జేపీ నడ్డా..** కాంగ్రెస్ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకువెళ్లడానికి బీజేపీ ఈనెల 1వ తేదీ నుంచి కార్యక్రమాలను నిర్వహిస్తోంది. చార్జిషీట్లు, బైక్‌ర్యాలీలు, బహిరంగ సభలను చేపడుతోంది. కార్నర్ మీటింగులు ఏర్పాటుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది పాలన వైఫల్యాలపై 6 అబద్ధాలు, 66 మోసాల పేరిట ఈనెల 7న సరూర్ నగర్ స్టేడియంలో, బీజేపీ ఆధ్వర్యంలో భారీ బహిరంగ సభను ఆర్గనైజ్ చేస్తోంది. దీనికి ముఖ్యఅతిథిగా బీజేపీ జాతీయ అధ్యక్షులు జగత్ ప్రకాష్ నడ్డా, కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ కుమార్ హాజరుకానున్నారు. వీరితో పాటు ఈ బహిరంగ సభలో బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు, ఎంపీ డీకే అరుణ, బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు, బీజేపీ పార్లమెంటరీ బోర్డు సభ్యులు, పార్లమెంట్ సభ్యులు డాక్టర్ కే లక్ష్మణ్, బీజేపీ శాసనసభా పక్షనాయకులు మహేశ్వర్ రెడ్డి, బీజేపీ మండలి పక్షనాయకులు ఏవీయన్ రెడ్డి, బీజెపి జాతీయ కార్యవర్గ సభ్యులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొనేలా ఏర్పాట్లు చేస్తున్నారు. గతేడాది సీఎంగా రేవంత్ ప్రమాణస్వీకారం చేసిన రోజునే బీజేపీ బహిరంగ సభను నిర్వహిస్తుంది. రాష్ట్రంలో బీజేపీ బలపడాలని, కాంగ్రెస్‌కు తామే ప్రత్యామ్నాయం అనే రీతిలో ప్రజల్లో అటెన్షన్ తెచ్చేందుకు మీటింగ్ నిర్వహిస్తున్నారు.

# రేవంత్ ప్రతిష్టిస్తోంది.. తెలంగాణ తల్లినా.. కాంగ్రెస్ తల్లినా?



హైదరాబాద్ : బీఆర్ఎస్ కేంద్ర కార్యాలయంలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వర్థంతి కార్యక్రమంలో మాజీ మంత్రి కేటీఆర్ పాల్గొని.. అంబేద్కర్‌కు నివాళులర్పించారు. . ఈ సందర్భంగా మాజీ మంత్రి మాట్లాడుతూ.. ప్రజాసమస్యలపై శాసనసభలో రేవంత్ ప్రభుత్వాన్ని నిలదీస్తామన్నారు. రేవంత్ ప్రతిష్టిస్తోంది.. తెలంగాణ తల్లినా? కాంగ్రెస్ తల్లినా? అని ప్రశ్నించారు. "ఆహ్వానం మాకు మ్యాటర్ కాదు.. తెలంగాణ తల్లి మాకు మ్యాటర్" అని తెలిపారు. తెలంగాణ తల్లి విగ్రహం అంటే రేవంత్ రెడ్డి ఇంట్లో కార్యక్రమం కాదన్నారు. లగచర్ల, గురుకులాలు, వ్యవసాయ సంక్షోభవం, ఆటో డ్రైవర్ల ఆత్మహత్యలపై అసెంబ్లీలో ప్రశ్నిస్తామని తెలిపారు. అసెంబ్లీ, మండలి సమావేశాలు కనీసం నెల రోజులు నడపాలని డిమాండ్ చేశారు. తెలంగాణ తల్లి విగ్రహాన్ని కేసీఆర్ ఏర్పాటు చేసినప్పుడు రేవంత్ రెడ్డి ఎక్కడున్నారని ప్రశ్నించారు. ప్రభుత్వాలు మారినపుడల్లా గత ప్రభుత్వం నిర్ణయాలు మారాలా అని నిలదీశారు. ఇందిరాగాంధీ ఏర్పాటు చేసిన భారతమాత రూపాన్ని వాజపేయి మార్చలేదన్నారు. నాలుగేళ్ళ తర్వాత రాజీవ్ రాంధీ విగ్రహం స్థానంలో తెలంగాణ తల్లి విగ్రహం ఉంటుందని స్పష్టం చేశారు. కేసీఆర్‌పై రేవంత్ రెడ్డి నోటికి హద్దు అదుపు లేకుండా పోయిందని మండిపడ్డారు. సోనియా గాంధీని బలిదేవత అన్న రేవంత్ ఇప్పుడు తెలంగాణ తల్లి అంటున్నారన్నారు. రేవంత్ చెప్తే.. కేసీఆర్ నేర్చుకోవాల్సిన పరిస్థితిలో లేరన్నారు. మర్యాద.. రేవంత్ అడ్డుకుంటే రాదని.. ఇచ్చుపుచ్చుకోవాలని హితవుపలికారు. కేసీఆర్‌ను గౌరవిస్తేనే.. రేవంత్ రెడ్డిని, ఆయన కుర్చీని గౌరవిస్తామన్నారు. 125 అడుగుల అంబేద్కర్ విగ్రహాన్ని రేవంత్ నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. హైకమాండ్ నుంచి వచ్చిన డైరెక్షన్‌తోనే అంబేద్కర్, పీవీ విగ్రహాలను రేవంత్ పట్టించుకోవటం లేదని విమర్శించారు. 125 అడుగుల అంబేద్కర్ విగ్రహం సందర్శనకు అవకాశం ఉందన్నారు. 125అడుగుల విగ్రహం సందర్శనకు అవకాశం ఇవ్వకుండా.. తాళాలు వేసి అపరిశుభ్రంగా తయారుచేశారని మండిపడ్డారు. ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలుపుతామంటే పోలీసులతో అడ్డుకుంటున్నారన్నారు. "గురుకుల విద్యార్థులను మేను ఎవరెస్ట్ శిఖరాన్ని ఎక్కిస్తే.. రేవంత్ పాడెను ఎక్కిస్తున్నారు" అంటూ విమర్శించారు. యూపీలో తిరగనివ్వటం లేదని మొత్తుకుంటోన్న రాహుల్ గాంధీ.. తెలంగాణలో ఏం జరుగుతుందో తెలుసుకోవాలన్నారు. తెలంగాణలో ఇందిరమ్మ ఎమర్జన్సీనే నడుస్తోంది అంటూ కేటీఆర్ వ్యాఖ్యలు చేశారు.

**దళితుల మీద కక్షా.. లేక...** అలాగే ఎక్స్ వేదికగా కూడా తెలంగాణ ప్రభుత్వం, రాహుల్ గాంధీపై కేటీఆర్ విరుచుకుపడ్డారు. రాహుల్ గాంధీ రాజ్యాంగాన్ని చేతిలో పట్టుకుని తిరుగుతారని.. ఆ రాజ్యాంగం రచించిన మహనీయుడు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 125 అడుగుల విగ్రహాన్ని కేసీఆర్ గౌరవంగా తెలంగాణ నడిబొడ్డున హుస్సేన్ సాగర్ తీరాన సగౌరవంగా ప్రతిష్టించారని తెలిపారు. అదే రాజ్యాంగం మీద ప్రమాణం చేసిన సీఎం రేవంత్ కనీసం మహనీయుడు అంబేద్కర్ జయంతి, వర్ధంతులకు కనీసం దండేసి, దండంపెట్టి స్మరించుకునే అవకాశం ఇవ్వడం లేదని విమర్శించారు.



తెలంగాణ తల్లి విగ్రహ నమూనా విడుదల

# ఓ వైపు సంబురం.. ఇంకోవైపు సమరం..

## తెలంగాణ పాలిటిక్స్‌లో ఏం జరుగుతోంది.?




హైదరాబాద్ : ఓ వైపు సంబురం..ఇంకోవైపు సమరం. కలసి రండి సలహాలు సూచనలు ఇవ్వండి. పెద్దరికాన్ని నిలబెట్టుకోండి. పని చేస్తుంటే కాళ్లల్లో కట్టెలు పెట్టడం మానుకోండి. ఇది సీఎం రేవంత్ రెడ్డి ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్‌కు చేస్తోన్న సూచన. ప్రజా విజయోత్సవాలకు రండి..తమిళనాట సాంప్రదాయం నెలకొల్పుదామంటున్నారు. అయితే సీఎం వైఖరి నోటితో నవ్వి నొసలుతో ఎక్కిరించినట్లు ఉందంటోంది బీఆర్ఎస్. ఓవైపు రెచ్చగొట్టుకుంటూ ఇంకో వైపు నీతులు చెప్తున్నారంటూ మండిపడుతోంది. విజయోత్సవాల జోరులో కాంగ్రెస్.. పోరాటంలో గులాబీ దళం..తెలంగాణ పాలిటిక్స్‌లో ఏం జరుగుతోంది.?

**బీఆర్ఎస్‌ను బ్లేమ్ చేసే ప్రయత్నం స్టార్ట్..** తెలంగాణలో పొలిటికల్ ఫైట్ ఇంట్రెస్టింగ్‌గా మారింది. ఓ వైపు ప్రజా విజయోత్సవాలతో సంబురాల జోష్‌లో కాంగ్రెస్ ఉంటే..ప్రజా సమస్యల మీద పోరు కొనసాగుతూనే ఉంటుందంటోంది బీఆర్ఎస్. సీఏ రేవంత్‌రెడ్డి ఓవైపు అరెస్టులు అంటూ రెచ్చగొడుతూనే ఇంకోవైపు ప్రవచనాలు చెప్తున్నారంటూ ఫైర్ అవుతోంది గులాబీదళం. ఉప్పు, నిప్పు అన్నట్లుగా కొనసాగుతున్న కాంగ్రెస్, బీఆర్ఎస్ రాజకీయం..సీఎం రేవంత్ రెడ్డి కామెంట్స్‌తో మరింత రంజుగా మారుతోంది. ప్రజా విజయోత్సవాల్లో పాల్గొనాలంటూ కేసీఆర్‌తో పాటు బీఆర్ఎస్ నేతలకు ఆహ్వానిస్తున్నారు సీఎం రేవంత్. సెక్రటేరియట్‌లో తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణకు రావాలని కూడా ఇన్వైట్ చేస్తామంటున్నారు.

ఇక్కడే రేవంత్ రూట్ మార్చినట్లు కనిపిస్తోంది. బీఆర్ఎస్‌ను బ్లేమ్ చేసే ప్రయత్నం స్టార్ట్ చేసినట్లు టాక్ వినిపిస్తోంది. ప్రతిపక్ష నాయకుడుగా కేసీఆర్ అసెంబ్లీకి రారు.. ప్రజలు ఎలా అర్థం చేసుకోవాలని ప్రశ్నిస్తున్నారు రేవంత్. సలహాలు, సూచనలు ఇస్తే స్వీకరిస్తామంటున్నారు. పెద్దరికాన్ని నిలబెట్టుకోండి.. ప్రతిదీ అడ్డుకోవడం సరికాదంటూ రిక్వెస్ట్ చేస్తున్నారు.

**బ్లేమ్ గేమ్ పాలిటిక్స్ అర్థం కావడం లేదంటున్న అపోజిషన్..** ఏకంగా తమిళనాడు మాదిరి.. మంచి సంప్రదాయాన్ని నెలకొల్పుదామంటూ పిలుపునిస్తున్నారు సీఎం రేవంత్. ఇదే సమయంలో ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిని అరెస్ట్ చేయడం..ఆయనను కలిసేందుకు వెళ్లిన హరీశ్‌రావును కూడా అదుపులోకి తీసుకోవడం కొత్త చర్చకు దారి తీస్తోంది. సీఎం తీరు మీద బీఆర్ఎస్ ఫైర్ అవుతోంది. గురుకుల హాస్టళ్లలో పిల్లలకు సరిగ్గా తిండి పెట్టకుండా..రైతులకు పూర్తిస్థాయిలో రుణమాఫీ చేయకుండా..ఏం నిర్ణయం తీసుకున్నా ప్రజల కోణంలో ఆలోచించకుండా బ్లేమ్ గేమ్ పాలిటిక్స్ ఏంటో అర్థం కావడం లేదంటోంది అపోజిషన్. సీఎం తప్పులన్ని తనదిక్కు పెట్టుకుని తమను కార్నర్ చేస్తున్నారంటూ ఫైర్ అవుతోంది. ఎన్ని కేసులు పెట్టినా..అక్రమ అరెస్ట్‌లు చేసినా తమ పోరాటం కంటిన్యూ అవుతూనే ఉంటుందంటోంది బీఆర్ఎస్.

**ఇప్పటికీ ప్రతిపక్ష నాయకుడిగానే మాట్లాడుతున్నారని ఆగ్రహం..** మాట్లాడితే కేసీఆర్ సభకు రావాలంటున్న రేవంత్..నిన్న మొన్నటి వరకు పబ్లిక్ మీటింగ్‌లలో మాట్లాడిన తీరును గుర్తుకు తెచ్చుకోవాలంటోంది బీఆర్ఎస్. బాధ్యతాయుతమైన సీఎం స్థాయిలో ఉండి అడ్డగోలుగా మాట్లాడటమే కాకుండా ఇప్పుడు ఏం తెల్వనట్లుగా అపోజిషన్ రోల్ పోషించాలి..సూచనలు ఇవ్వాలని నీతులు చెప్తున్నారని మండిపడుతోంది గులాబీ దళం. రేవంత్ ఇప్పటికీ ప్రతిపక్ష నాయకుడిగానే మాట్లాడుతున్నారని..అసలు సీఎం హోదాకు తగ్గట్లుగానే వ్యవహరించడం లేదంటోంది. బహిరంగ సభల్లో రేవంత్ ఏం మాట్లాడుతున్నారో ప్రజలు గమనిస్తున్నారని.. అందుకే ఇప్పుడు కొంత రాగం అందుకున్నారని విమర్శిస్తోంది బీఆర్ఎస్.

**వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే రేవంత్ వాయిస్ మార్చేశారా? :** ప్రతిపక్ష పాత్ర పోషించాలని రేవంత్ సూచించడం విడ్డూరంగా ఉందంటోంది బీఆర్ఎస్. మూసీ నుంచి లగచర్ల వరకు..విద్యార్థుల ఫుడ్ పాయిజన్ ఘటనల నుంచి రైతు సమస్యల వరకు తాము ప్రజల తరఫున పోరాడుతూ ప్రతిపక్షంగా బాధ్యతాయుతంగా వ్యవహరిస్తున్నామంటోంది గులాబీ పార్టీ.

ఏ విషయంలో మీరు సలహాలు కోరితే ఇవ్వలేదో చెప్పాలని ప్రశ్నిస్తోంది. ప్రభుత్వంగా అడ్డగోలు నిర్ణయాలు తీసుకుంటే ప్రజలు రోడ్డెక్కి ఆందోళన చేస్తున్నారని..దానికి తమను బద్నాం చేయడం ఎందుకంటోంది బీఆర్ఎస్. సమస్య ఎక్కడ ఉంటే తాము అక్కడ ఉంటున్నామని.. వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే రేవంత్..వాయిస్ మార్చేశారని మండిపడుతోంది బీఆర్ఎస్. డిసెంబర్ 9వరకు ప్రజా విజయోత్సవాలు జరగనున్నాయి. అదే రోజు సెక్రటేరియట్‌లో తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ కార్యక్రమం ఉంది. వీటికి బీఆర్ఎస్ నేతలను ఇన్వైట్ చేస్తామంటున్నారు రేవంత్. మరి కేసీఆర్‌తో సహా గులాబీ నేతలు..ప్రజా విజయోత్సవాలకు వెళ్తారా..లేక ఇలాగే పోరుబాటను కంటిన్యూ చేస్తారా అన్నది చూడాలి.

# సంపాదకీయం

## తెలుగు రాష్ట్రాల్లో లేని అడ్జెస్ట్ మెంట్ మహారాష్ట్రలో కనిపిస్తోంది!

అనుకున్నదే నిజమైంది. అంచనాలకు తగ్గట్లే పరిణామాలు చోటు చేసుకున్నాయి. అధికారం చేతికి వచ్చే అవకాశం కించిత్ ఉన్నా.. అధికారాన్ని తమ చేతిలోకి తీసుకోవటానికి ఏమైనా చేసే అలవాటున్న మోడీషాలు.. అనుకున్నట్లే మహారాష్ట్ర ముఖ్యమంత్రిగా దేవేంద్ర ఫడ్నవీస్ ను సీఎం చేయటం తెలిసిందే. మహారాష్ట్రకు ముచ్చటగా మూడోసారి ముఖ్యమంత్రిగా దేవేంద్ర ఫడ్నవీస్ ప్రమాణస్వీకారం చేయటంతో పది రోజులుగా కొనసాగుతున్న సస్పెన్స్ కు తెర పడినట్లైంది. గతంలో రెండుసార్లు సీఎంగా వ్యవహరించిన దేవేంద్ర తొలిసారి ఐదేళ్లు.. రెండోసారి ఐదు రోజుల పాటు ముఖ్యమంత్రిగా వ్యవహరించారు. మూడోసారి సీఎం అయిన ఆయన.. ఈసారి ఎంత కాలం ముఖ్యమంత్రిగా ఉంటారో చూడాలి. ఇక.. సీఎంగా దేవేంద్ర.. డిప్యూటీ సీఎంలుగా ఏక్ నాథ్ షిండే.. అజిత్ పవార్ ప్రమాణస్వీకారం చేశారు. మహారాష్ట్ర రాజకీయాల్నిచూస్తే మాత్రం అడ్జెస్టుమెంట్ కు కేరాఫ్ అడ్రస్ గా అక్కడి నేతలు నిలుస్తారు. రెండుసార్లు ముఖ్యమంత్రిగా వ్యవహరించిన దేవేంద్ర ఫడ్నవీస్.. కాలం కలిసి రాని కాలంలో డిప్యూటీ సీఎంగా వ్యవహరించటం.. ఏక్ నాథ షిండే సీఎంగా ఉన్నప్పుడు సర్దుకుపోవటం కనిపిస్తుంది. అనూహ్యంగా ముఖ్యమంత్రి పదవిని సొంతం చేసుకోవటంతో పాటు.. తన పాలనపై ప్రజలను తీర్పు కోరుతూ ఎన్నికల బరిలోకి దిగి.. విజయం సాధించటం ద్వారా ఏక్ నాథ్ షిండే సంచలనాన్ని క్రియేట్ చేశారని చెప్పాలి. అయినప్పటికి బీజేపీ బలాన్ని గుర్తించటం.. అందుకు అనుగుణంగా జరిగే అధికార బదిలీ వేళలో మనసుకు నచ్చని పరిణామాలు చోటు చేసుకుంటున్నప్పటికి సర్దుకొని.. డిప్యూటీ సీఎంగా బాధ్యతలు చేపట్టటం చూస్తే.. మహారాష్ట్ర రాజకీయ నేతల్లో ఉన్న సర్దుబాటుగుణం తెలుగు రాష్ట్రాల్లో ఎక్కడా కనిపించదు. ఒకసారి ముఖ్యమంత్రి అయితే.. అంతకు తక్కువ పదవులకు ససేమిరా అనటం కనిపిస్తుంది. పరిస్థితులకు తలొగ్గేందుకు తగ్గేదేలే అన్నట్లు ఉంటారే తప్పించి.. కాలానికి అనుగుణంగా అన్న మాటే వినిపించదు. అది సీఎం పదవి అయినా.. చిన్న పదవి అయినా. కానీ.. మహారాష్ట్రలో దేవేంద్ర ఫడ్నవీస్.. తాజాగా ఏక్ నాథ్ షిండేలను చూస్తే.. సమకాలీన రాజకీయాలకు తగ్గట్లు నేతలు ఎలా ఉండాలో తమ తీరుతో వారిద్దరు చెప్పేస్తున్నట్లుగా అనిపిస్తుంది. మహారాష్ట్రలో కూటమి ప్రభుత్వం ఏర్పాటును చూసిన తర్వాత అర్థమయ్యేది ఒక్కటే.. అధికారాన్ని అందుకునే ఏ అవకాశాన్ని బీజేపీ వదులుకోదని. ఈ సందర్భంగా ఆటలో ఎంతటి శక్తివంతమైన ఆటగాడు ఉన్నా.. తాము చెప్పింది మాత్రమే చేసేలా సదరు ఆటగాడిని సెట్ చేసే విషయంలో మోడీషాలకు తిరుగు ఉండదని.

## రాజ్యాంగ నిర్మాత బి.ఆర్ అంబేద్కర్ కు ఘన నివాళి





శామీర్ పేట, (గరుడ వార్త) : పూర్వ షామీర్పేట్ ఉమ్మడి మండల ప్రజలు నాయకులు ఘనంగా భారతరత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. శుక్రవారం ఉమ్మడి శామీర్ పేట మండలం లోని వివిధ గ్రామాలలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా దళిత సంఘం నాయకులు, వివిధ పార్టీల నాయకులు ఆయన విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా దళిత సంఘం నాయకులు, వివిధ పార్టీల నాయకులు మాట్లాడుతూ భారతదేశానికి రాజ్యాంగాన్ని అందించి మార్గదర్శకాన్ని ఏర్పాటు చేసిన గొప్ప వ్యక్తి అంబేద్కర్ అన్నారు. అంబేద్కర్ ను దేశంలోనే కాకుండా ప్రపంచంలో ఆరాధిస్తున్నారని చెప్పారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేస్తూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఉమ్మడి శామీర్ పేట మండలంలోని ఆయా గ్రామాలలో అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మూడు చింతలపల్లి మండల తాహాసిల్దార్ వెంకట్ నరసింహారెడ్డి, దళిత సంఘం నాయకులు, వివిధ పార్టీల నాయకులు నాగరాజు, జాం రవి, ర్యాకల రాజేంద్ర ప్రసాద్ గౌడ్, జెర్రిపోతుల నర్సింలు, కే కృష్ణ, ఎన్ ప్రవీణ్, ఊరడి వెంకటేష్, ఎన్. అశోక్, జి. ప్రవీణ్, ఎం నర్సిములు, యూ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## రుడాకు పచ్చజెండా జిల్లాకు మహర్దశ



గోదావరిఖని : అందరూ ఊహించినట్టుగానే రామగుండం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(రుడా) ఏర్పాటు చేస్తూ గెజిట్ నోటిఫికేషన్ విడుదలైంది. దీంతో జిల్లాకు మహర్దశ చేకూరనుంది. పట్టణీకరణ వేగం కానుంది. అలాగే గ్రామాల్లో మౌలిక సదుపాయాలు సైతం పెరగనున్నాయి. ఏకంగా జిల్లా రూపురేఖలు మారే అవకాశం ఏర్పడింది.

ప్రత్యేక నిధులతో.. రుడాతో గ్రామాల్లో మౌలిక సదుపాయాలు మెరుగపడనున్నాయి. రహదారులతోపాటు విద్యుద్దీకరణ, నీటి సౌకర్యం మరింత మెరుగయ్యే అవకాశం ఉంది. దీంతో గ్రామాలన్ని పట్టణీకరణ దిశగా అడుగులు వేయనున్నాయి. రుడాతో గ్రామ పంచాయతీలు కొనసాగుతూనే పట్టణీకరణకు విడుదలయ్యే ప్రత్యేక నిధులను కూడా వెచ్చించుకునే అవకాశం ఉంటుంది. ఈ ప్రాంతంలో చెల్లించే పన్నులను కూడా స్థానికంగా ఖర్చు చేసుకునే వెసులుబాటు ఉంటుంది. దీంతోపాటు కొన్ని పట్టణాలు బీ-కేటగిరి నగరాలుగా గుర్తించే అవకాశం ఉంటుంది.

పరిశ్రమలతో మరింత అభివృద్ధిజిల్లా మొత్తం రుడాగా మారడంతో వేగంగా అభివృద్ధి జరిగే అవకాశం ఉంది. జిల్లాలోని భారీ పరిశ్రమలతో మరింత ఉపాధి అవకాశాలు పెరగనున్నాయి. జిల్లాలో ఉన్న సింగరేణి, ఎన్టీపీసీ, ఆర్ఎఫ్‌సీఎల్, జెన్‌కో, కేశోరాం సిమెంటు ఫ్యాక్టరీలతోపాటు రైసు మిల్లుల ద్వారా పన్నులు భారీగానే రానున్నాయి. వీటిద్వారా వచ్చే పన్నులను రుడా ప్రాంతంలో ఖర్చు చేసుకునే అవకాశం ఉంది. ఇటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధులతోపాటు పరిశ్రమల పన్నుల ద్వారా చేకూరే నిధులతో జిల్లా రూపురేఖలు మారే అవకాశం ఉందని భావిస్తున్నారు.

జిల్లాను రామగుండం అర్బన్ డెవలప్‌మెంటు అథారిటీ(రుడా)గా ఏర్పాటు చేయడం కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమైందని ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ అన్నారు. రామగుండం కార్పొరేషన్ కూడా కాంగ్రెస్ హయాంలోనే ఏర్పడిందని గుర్తుచేశారు. ఎన్నికలముందు ఇచ్చిన హామి మేరకు రుడా ఏర్పాటుకు జీవో విడుదల చేయించామని పేర్కొన్నారు.

**14 మండలాలు**

జిల్లాలోని రామగుండం, అంతర్గాం, పాలకుర్తి, పెద్దపల్లి, జూలపల్లి, ఎలిగేడు, సుల్తానాబాద్, ఓదెల, కాల్వశ్రీరాంపూర్, కమాన్‌పూర్, రామగిరి, ముత్తారం, మంథని, ధర్మారం మండలాలు రుడా పరిధిలో ఉండనున్నాయి. జిల్లాలో మొత్తం 14 లక్షల వరకు జనాభా ఉంది. జనాభాకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపట్టేందుకు నిధులను కూడా ఎక్కువ స్థాయిలో విడుదల చేసే అవకాశం ఉంది.

**3 పురపాలికలు.. 198 గ్రామాలు**

జిల్లాలోని మూడు పురపాలక సంఘాలు పెద్దపల్లి, సుల్తానాబాద్, మంథని.. రామగుండం నగరపాలకతోపాటు 14 మండలాలను కలుపుతూ రుడాగా ఏర్పాటు చేశారు. జిల్లాలోని 198 గ్రామాలు దీని పరిధిలోకి రానున్నాయి. పట్టణీకరణను వేగవంతం చేసేందుకు అర్బన్ డెవలప్‌మెంటు అథారిటీ కింద నిధులు వెచ్చించేందుకు రుడా ఎంతో ఉపయోగపడనుంది. కేంద్ర ప్రభుత్వం ద్వారా విడుదలయ్యే ప్రత్యేక నిధులతో ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకు జిల్లాను రుడాగా మార్చాలని ప్రతిపాదనలు చేసిన మేరకు ప్రభుత్వ ప్రిన్సిపల్ కార్యదర్శి దానకిశోర్ ఆదివారం జీవో విడుదల చేశారు. జిల్లా జనాభాను ప్రాతిపదికన తీసుకుని రుడాగా మార్చిన ప్రభుత్వం ఇందులోని గ్రామాలను పట్టణీకరణ దిశగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోనుంది. ప్రస్తుతం జగిత్యాల జిల్లా పరిధిలోకి వెళ్లిన ఎండపల్లి మండలంలోని ముంజంపల్లి, మారేడుపల్లి, ఉండెడ గ్రామాలను కూడా రుడా పరిధిలోకి తీసుకున్నారు.

## వైద్య నిపుణుల పల్లె బాట



పెద్దపల్లి : ప్రజలకు ఏ చిన్న ఆరోగ్య సమస్య వచ్చినా స్థానికంగా ఉండే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు ఆశ్రయిస్తారు. అక్కడ మాత్రలు తప్ప సేవలు అంతంత మాత్రమే. వ్యాధి తీవ్రమైతే అప్పోసప్పో చేసుకొని పట్టణాల్లోని ప్రైవేటు ఆసుపత్రుల బాట పడుతున్నారు. కొందరు జిల్లా ఆసుపత్రికి వెళ్లి చికిత్స పొందుతున్నారు. ఇక ఇలాంటి వెతలు దూరం కానున్నాయి. స్థానిక ఆరోగ్య కేంద్రాల్లోనే వైద్య నిపుణుల చికిత్స అందనుంది. ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో భాగంగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో విధులు నిర్వహిస్తున్న వైద్య నిపుణులు ఇక పల్లె బాట పట్టనున్నారు. జిల్లాలో 18 ప్రాథమిక, 7 పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 4 బస్తీ దవాఖానాలు, 66 పల్లె, 104 ఉప వైద్య కేంద్రాల్లో సేవలు అందుతున్నాయి. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోకి వెళ్లేందుకు వైద్య నిపుణుల వివరాలు సేకరణ తుది దశకు చేరింది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు కీలక విభాగాల వైద్య నిపుణులతో మెరుగైన సేవలు అందుబాటులోకి రానున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లోని పేద ప్రజలకు పట్టణాలకు వెళ్లకుండా వ్యయ ప్రయాసలు తప్పనున్నాయి. వైద్య నిపుణులకు సరిపడా మందులు సమకూర్చితేనే పేదలకు మరింత మేలు చేకూరనుంది.

**అమలు ఇలా..**

జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య, పట్టణ ఆరోగ్య కేంద్రాలు, ఉప కేంద్రాలు, బస్తీ దవఖానాలకు ప్రభుత్వ వైద్య నిపుణులు వెళ్తారు.

తొమ్మిది అంశాలకు సంబంధించిన ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తారు.

వ్యాధి తీవ్రత ఎక్కువ ఉంటే సమీపంలోని జిల్లా, ప్రాంతీయ ఆసుపత్రులకు పంపిస్తారు.

ఎంపిక చేసిన ఆరోగ్య కేంద్రాల్లో వారంలో మూడు రోజులు సోమ, మంగళ, గురువారాల్లో కీలక విభాగాల వైద్య నిపుణులు వెళ్లి సేవలందించనున్నారు.

వైద్య నిపుణుల సేవలపై జిల్లా స్థాయిలో ఎప్పటికప్పుడు పర్యవేక్షణ ఉంటుంది. ఎంత మందిని పరీక్షించారో నివేదికలను తెప్పించుకోనున్నారు.

**పేదల వద్దకు మెరుగైన వైద్యం**

జిల్లాలో ప్రాథమిక, పట్టణ ఆరోగ్య కేంద్రాలకు వైద్య నిపుణులు వెళ్లి చికిత్స అందించనున్నారు. జిల్లా ఆసుపత్రి, ప్రాంతీయ ఆసుపత్రుల్లోని వైద్య నిపుణుల వివరాలు సేకరిస్తున్నాం. పేదలకు తొమ్మిది రకాల వైద్య సేవలు అందుతాయి. ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి.

ప్రమోద్‌కుమార్, జిల్లా వైద్యాధికారి

**వైద్య నిపుణులు వీరే**

మహిళా వైద్య నిపుణులు

చిన్న పిల్లల వైద్యులు

జనరల్ ఫిజీషియన్

ఎముకలు, కీళ్ల సర్జన్

మానసిక వైద్య నిపుణులు

దంత నిపుణులు ఈఎన్‌టీ (చెవి, ముక్కు, గొంతు)

## రేషన్ దందా.. మహా దర్జా

మంథని : అధికారుల నిఘా లేకపోవడంతో నిత్యం టన్నుల కొద్దీ రేషన్ బియ్యం సరిహద్దులు దాటుతోంది. మంథని నియోజకవర్గం నుంచి మహారాష్ట్రకు దందా యథేచ్ఛగా సాగుతోంది. స్మగ్లర్లు గ్రామాల్లోని దుకాణాల నుంచి సేకరించి వివిధ మార్గాల్లో పొరుగు రాష్ట్రానికి తరలిస్తున్నారు. అధికారులు తనిఖీల్లో రేషన్ డీలర్ల వద్ద బియ్యం అక్రమ నిల్వలను గుర్తిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసినా జరిమానాతో సరిపెడుతూ దుకాణాల నిర్వహణకు అనుమతులు ఇస్తుండటంతో అక్రమాలకు తెర పడటం లేదు.

**ఏడు నెలల్లో 400 క్వింటాళ్లు**

మంథని ప్రాంతంలో ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ఈ నెల వరకు అక్రమంగా తరలిస్తున్న 400 క్వింటాళ్లకు పైగా రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. ఏప్రిల్‌లో మంథని బస్సు డిపో వద్ద 25 క్వింటాళ్లు, అక్కడికి సమీపంలో 28 క్వింటాళ్లు, మే నెలలో సిరిపురంలో 35 క్వింటాళ్లు, మంథని లైన్‌గడ్డ, గంగాపురిలో 60 క్వింటాళ్లు, జూన్‌లో ముత్తారం మండలం అడవిశ్రీరాంపూర్‌లో 125 క్వింటాళ్లు, ఆగస్టులో సిద్దపల్లిలో 5, ముత్తారంలో 25 క్వింటాళ్లు, సెప్టెంబరులో నాగారంలో 48 క్వింటాళ్లు, ఈ నెల 22న ముత్తారం మండలం పోతారంలో 4, మంథని పట్టణంలోని ఓ రేషన్ దుకాణంలో నిల్వ ఉన్న 55 క్వింటాళ్ల బియ్యాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. బియ్యం స్మగ్లర్ల మధ్య సయోధ్య లేక అధికారులకు సమాచారం ఇస్తూ ఒకరి బియ్యాన్ని మరొకరు అధికారులకు పట్టిస్తున్నట్లు తెలిసింది.

**నిఘా పెంచి అక్రమాన్ని అరికడతాం**



మంథని ప్రాంతం నుంచి బియ్యం అక్రమ రవాణా జరగకుండా చర్యలు తీసుకుంటాం, రాత్రి వేళ నిఘా పెంచి తరలింపును అడ్డుకుంటాం. తరచూ రేషన్ దుకాణాలు తనిఖీ చేసి, నిల్వలను పరిశీలిస్తాం.

రాజేందర్, పెద్దపల్లి జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి

**వయా సుందిల్ల బ్యారేజీ**

మంథనిలో పౌర సరఫరాల గోదాం నుంచి ముత్తారం, కమాన్‌పూర్, రామగిరి, మంథని మండలాల్లోని 93 రేషన్ దుకాణాలకు ప్రతి నెలా దాదాపు 6,500 క్వింటాళ్ల బియ్యం సరఫరా అవుతోంది.

బియ్యం వద్దనుకుంటున్న లబ్ధిదారుల నుంచి డీలర్లు కిలోకు రూ.10 చొప్పున కొనుగోలు చేస్తున్నారు. బదులుగా కిరాణా సామగ్రి అప్పగిస్తున్నారు. అదే బియ్యాన్ని స్మగ్లర్లకు కిలోకు రూ.12 చొప్పున విక్రయిస్తున్నారు. అలా సేకరించిన బియ్యాన్ని దళారులు ఒకచోట నిల్వ చేసి టోకున మహారాష్ట్రకు రవాణా చేస్తున్నారు.

స్మగ్లర్లు బియ్యాన్ని కమాన్‌పూర్, రామగిరి మండలాల మీదుగా సుందిల్ల బ్యారేజీ నుంచి మహారాష్ట్రకు తరలిస్తున్నారు.

మరోవైపు మంథని మండలం ఎగ్లాస్‌పూర్ చెక్‌పోస్టు మార్గానికి ప్రత్యామ్నాయంగా మంథని మండలం నుంచి ఖమ్మంపల్లి, తాడిచెర్ల, కొయ్యూరు, కాళేశ్వరం వంతెన మీదుగా రవాణా చేస్తున్నారు.

మహారాష్ట్రలోని సిరొంచ రైస్ మిల్లులో బియ్యాన్ని రీసైక్లింగ్ చేసి సీఎంఆర్ కింద తిరిగి మంథనికి పంపిస్తున్నారు. ఏడాది కిందట సిరొంచ నుంచి మంథని మండలం గద్దలపల్లి మిల్లుకు తరలిస్తున్న రెండు లారీల బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు.

## నైపుణ్యముంటే.. ఉపాధి వెంటే!

ఖమ్మం : యువతలో నైపుణ్యం పెంచి మెరుగైన అవకాశాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన స్కిల్స్ యూనివర్సిటీలో వచ్చే నెల నుంచి తరగతులు ప్రారంభం కానున్నాయి. దీనికి సంబంధించిన ఆన్‌లైన్ ప్రవేశాలకు ఈనెల 29న తుది గడువుగా నిర్ణయించింది. అధికారిక వెబ్‌సైట్ %www.yisu.in% లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఈ కోర్సులకు అర్హులైన అనేక మంది నిరుద్యోగ యువతీ యువకులు ఉన్నారు. రేపటితో గడువు ముగియనున్నందున ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

**ఉద్యోగాల కల్పనే లక్ష్యం**

యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీలో కోర్సు పూర్తి చేసిన ప్రతి విద్యార్థికీ కచ్చితంగా ఉపాధి కల్పించటమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళిక తయారు చేసింది. ఈ యూనివర్సిటీలో నైపుణ్యం పెంచుకుంటే సత్వరం కొలువు లభించే అవకాశం ఉంటుంది. మొత్తం 17 రంగాల్లో ప్రతి సంవత్సరం 20 వేల మందికి ఉపాధి కల్పించటం లక్ష్యంగా ఏర్పాటు చేసిన ఈ సంస్థలో తొలి బ్యాచ్‌కు 2 వేల మందిని ఎంపిక చేయనున్నారు. ఈ ఏడాది మూడు రంగాల్లో నాలుగు కోర్సులను ప్రారంభిస్తున్నారు. ఔషధ, ఆరోగ్య సంరక్షణ, సరకు నిల్వ రంగాల్లో నాలుగు స్వల్పకాలిక కోర్సులకు అనుమతి లభించింది. ఈ కోర్సులకు సంబంధించి విస్తృత ప్రచారం లేకపోవడంతో చాలామంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోలేకపోతున్నారు.

**స్వల్పకాలిక కోర్సులు**

స్కూల్ ఆఫ్ హెల్త్‌కేర్: ఈ కోర్సులో నర్సింగ్ ఎక్సలెన్స్ సర్టిఫికేషన్ ప్రోగ్రాం చేసేందుకు జీఎన్ఎం, బీఎస్సీ నర్సింగ్, ఎమ్మెస్సీ నర్సింగ్, పోస్ట్‌బేసిక్ నర్సింగ్ చదివిన వారు అర్హులు. 18 నుంచి 35 సంవత్సరాల మధ్య వయసు ఉండాలి. కోర్సు కాల వ్యవధి 3 నెలలు.

స్కూల్ ఆఫ్ ఫార్మాస్యూటికల్స్ అండ్ లైఫ్ సైన్సెస్: ఇందులో అసోసియేట్ ప్రోగ్రాంను బీఎస్సీలో రసాయనశాస్త్రం ఒక సబ్జెక్టు కలిగి ఉన్న వారు ఎంచుకోవచ్చు. కోర్సు కాల వ్యవధి ఆరు నెలలు. శిక్షణ కాలంలో అభ్యర్థులకు నెలకు రూ.17,500 ఉపకార వేతనం ఇస్తారు.

స్కూల్ ఆఫ్ లాజిస్టిక్, ఈ-కామర్స్‌లో వేర్‌హౌస్ ఎగ్జిక్యూటివ్ సర్టిఫికెట్ ప్రోగ్రాం: కోర్సు కాల వ్యవధి మూడున్నర నెలలు. ఇంటర్, డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. 18 నుంచి 26 సంవత్సరాల లోపు వారు అర్హులు. కోర్సు ఫీజు రూ.12 వేలు.

# సర్వే నంబరు సృష్టించి.. ధరణిలో ఏమార్చి

హైదరాబాద్ : విప్రో సంస్థ పక్కనే ఉన్న సర్కారు భూముల ఆక్రమణకు రెండు రియల్ సంస్థలు పక్కా ప్రణాళికతో వ్యవహరించి రూ.1500 కోట్ల విలువైన 15 ఎకరాలను స్వాధీనం చేసుకున్నాయి. గతేడాది ఎన్నికలకు ముందు రియల్ సంస్థ ప్రతినిధులు ధరణి పోర్టల్‌లో తమ పేర్లను నమోదు చేయించుకున్నారు. సీఎం రేవంత్ ఆదేశాలతో వట్టినాగులపల్లిలోని విప్రో సంస్థ పక్కన ప్రభుత్వ భూముల్లో ఆక్రమణలపై నిఘా వర్గాలు ఆరాతీయగా రెవెన్యూ రికార్డుల్లో అక్రమాలు జరిగాయని గుర్తించారు. సర్వే నంబర్ 132లో 15 ఎకరాలను ముగ్గురు వ్యక్తులు, ఒక సంస్థ పేరుతో ధరణి పోర్టల్‌లో నమోదు చేసినట్టు ఆధారాలు సేకరించారు.

**నిషేధిత జాబితాలో చేర్చినా..**

వట్టినాగులపల్లిలోని సర్వే నంబర్ 132లో 56 ఎకరాల ప్రభుత్వ భూములున్నాయి. వీటిని హౌసింగ్‌బోర్డుకు అప్పగించినా ధరణి పోర్టల్, రిజిస్ట్రేషన్ శాఖ వెబ్‌సైట్‌లో ప్రభుత్వ భూములుగా ఉన్నాయి. వీటిని




కొనేందుకు, అమ్మేందుకు వీలులేదు. విప్రో పక్కనే ఉన్న ఈ భూముల్లో 15 ఎకరాలపై కన్నేసిన రియల్ సంస్థ ప్రతినిధులు 132 సర్వే నంబర్‌లో రెవెన్యూ రికార్డుల్లో లేని సబ్‌నంబర్లు సృష్టించి 6 ఎకరాలను ఒక సంస్థ పేరుతో ధరణిలో నమోదు చేయించారు. అనంతరం మరో నాలుగెకరాలను పట్టా భూమిగా రాయించారు. అలా 10 ఎకరాలను తెలివిగా నిషేధిత జాబితాలోంచి తప్పించారు. మరో ఐదు ఎకరాలు నిషేధిత జాబితాలోనే ఉన్నాయి.

**ధరణి పోర్టల్ సిబ్బంది సహకారం..**

ఈ అక్రమం వెనుక ధరణి పోర్టల్ ఇద్దరు ఔట్ సోర్సింగ్ సిబ్బంది హస్తం ఉన్నట్లు నిఘా వర్గాలకు ప్రాథమిక ఆధారాలు లభించాయి. 95 ఫైళ్లలో రికార్డులు మార్చారని, ప్రభుత్వ భూములను ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టారని ఇద్దరిపై గతేడాది డిసెంబరులో కలెక్టర్ కార్యాలయం ఏవో ఫిర్యాదు చేయడం, పోలీసులు కేసు నమోదు చేయడం వంటివాటిని పరిగణనలోకి తీసుకుని ఈ నిర్ధారణకి వచ్చారు. ధరణి పోర్టల్‌లో ప్రైవేటు వ్యక్తుల పేర్లు నమోదు చేసేప్పుడు ఎలాంటి పత్రాలు స్కాన్‌చేసి జతపరిచారు? ఈ పత్రాలతో ధరణి పోర్టల్‌లో రియల్ సంస్థ ప్రతినిధుల పేర్లను ఎవరు చేర్చారు? డిజిటల్ సంతకాలు ఎవరు చేశారు? అనే విషయాలు బహిర్గతం కానున్నాయి.

# కాలుష్యానికి మందు.. ఉద్యానమందు

హైదరాబాద్ : రోజురోజుకు మహానగరం కాలుష్య కోరల్లో చిక్కుకుంటోంది. వాహనాల కారణంగా అనేక ప్రాంతాల్లో పరిమితికి మించి వాయు కాలుష్యం ఉన్నట్లు పీసీబీ హెచ్చరిస్తోంది. ఈ నేపథ్యంలో పచ్చదనం అభివృద్ధికి పెద్దపీట వేయాల్సిన అవసరం ఉంది. ఈ నేపథ్యంలో హెచ్ఎండీఏ ఆధ్వర్యంలో పలు కాలనీల్లో పార్కుల అభివృద్ధికి శ్రీకారం చుట్టింది. వీటితోపాటు శివార్లలో 17 అర్బన్ ఫారెస్టు బ్లాకు అభివృద్ధికి రూపకల్పన చేసింది. మహానగర వ్యాప్తంగా దాదాపు 20కు పైగా ప్రాంతాల్లో కాలనీ పార్కులను ఏర్పాటు చేసి అక్కడ పచ్చదనానికి పెద్దపీట వేయనున్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే పలు ప్రాంతాల్లో ఈ పార్కులను సిద్ధం చేసింది. ప్రజాపాలన విజయోత్సవాల సందర్భంగా వీటిని అందుబాటులోకి తెచ్చేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. సరూర్‌నగర్‌లో జైహింద్‌నగర్‌లో





కాలనీ పార్కును సిద్ధమైంది. ఇందులో దాదాపు 10 వేల మొక్కలను నాటారు. వీటితోపాటు చెరువుల సుందరీకరణ సైతం చేపడుతున్నారు. అమీన్‌పూర్‌లోని సాంబునికుంట చుట్టూ పచ్చదనం పెంపొందించడానికి 25 వేల మొక్కలను నాటారు. మియాపూర్‌లోని మయూరి రాక్ గార్డెన్‌ను అభివృద్ధి చేశారు. ఇక్కడ 1.5 లక్షల మొక్కలను నాటింది. ఉదయం, సాయంత్రం వేళల్లో స్థానికులు ఇక్కడ సేద తీరవచ్చు.

# సింగరేణిలోనూ విజయోత్సవాలు..

సింగరేణి : కొత్త ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం పూర్తయిన సందర్భంగా ప్రభుత్వం విజయోత్సవాలు నిర్వహిస్తోంది. ఈ నేపథ్యంలో సింగరేణిలో సంవత్సర కాలంలో కొనసాగిన అభివృద్ధిని సంస్థ ప్రకటించింది. కార్మికులకు పంచిన బోనస్, నిర్వహించిన సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి పనులను యాజమాన్యం ప్రకటించింది. అండగా నిలుస్తోంది: ఎన్.బలరాం, సింగరేణి ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ప్రభుత్వం సింగరేణికి అడుగడుగునా అండగా నిలుస్తోంది. నైనీ కోల్‌బ్లాకు అనుమతులను ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క దగ్గరుండి ఒడిశా ప్రభుత్వంతో మాట్లాడారు. ఎప్పటికప్పుడు సంస్థ బాగోగులపై ప్రభుత్వం సమీక్ష నిర్వహిస్తూ అభివృద్ధి దిశగా అడుగులు వేసేందుకు తగిన సహకారాన్ని అందిస్తోంది. సింగరేణిలో సైతం విజయోత్సవాలను నిర్వహిస్తాం.

సింగరేణి చరిత్రలో అత్యధిక బొగ్గు ఉత్పత్తి, రవాణా, టర్నోవర్, లాభాలు.

కార్మికులకు రూ.796కోట్ల లాభాల వాటా పంపిణీ.

కాంట్రాక్టు కార్మికులకు ఎన్నడూ లేని విధంగా రూ.5వేల బోనస్ పంపిణీ.

ఈ ఏడాదిలో 2,165 పోస్టుల భర్తీ.

కారుణ్య నియామకాల్లో గరిష్ఠ వయోపరిమితిని 35 నుంచి 40ఏళ్లకు పెంపు.

సింగరేణి పొరుగుసేవల ఉద్యోగాల్లో 80శాతం స్థానికులకే అవకాశం.

సింగరేణి ఉద్యోగులకు రూ.కోటి ఉచిత ప్రమాద బీమా.సింగరేణి పొరుగుసేవల సిబ్బందికి రూ.30లక్షల ఉచిత ప్రమాద బీమా.కొత్తగూడెంలో 10.5మెగావాట్ల సౌరవిద్యుత్తు ప్లాంటు ఏర్పాటు.తాడిచెర్ల బ్లాక్2 కోసం రాష్ట్ర ప్రభుత్వ చొరవ.హైదరాబాద్‌లో సింగరేణి అతిథిగృహానికి శంకుస్థాపన.అన్ని నియోజకవర్గాల్లో అంబేడ్కర్ విజ్ఞాన కేంద్రాల ఏర్పాటుకు చేయూత.

# రుచి.. శుచి.. మేలు తలచి..



తాండూరు : ప్రభుత్వ విద్యాలయాల్లో చదువుకునే విద్యార్థుల ఆకలి తీర్చేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తున్న విషయం విదితమే. దీని కొనసాగింపులో ఎన్నో లోపాలు తలెత్తుతున్నాయి. పలు చోట్ల నాసి బియ్యం, పుచ్చు, చచ్చు కూరగాయలతో అపరిశుభ్ర వాతావరణంలో భోజనం పెడుతుండటంతో విద్యార్థులు అస్వస్థతకు గురవుతున్న ఘటనలు ఇటీవల తరచూ వెలుగుచూస్తున్నాయి. వైపు కాగా, కొన్ని విద్యాలయాల్లో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, నిర్వాహకులు సమష్టిగా ప్రత్యేక చొరవ చూపి నాణ్యమైన భోజనం అందించేందుకు కృషి చేస్తుండటం ప్రశంసనీయం. వారి కృషి మరింత మందికి స్ఫూర్తినిచ్చేందుకే ఈ కథనం.

**అన్నింటిని పర్యవేక్షిస్తూ..**

తాండూరు మండలం కొత్లాపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 52 మంది చదువుకుంటున్నారు. ఇక్కడ హెచ్ఎంగా పని చేస్తున్న వినోద్‌కుమార్.. బియ్యం అందించడం నుంచి భోజనం సిద్ధం అయ్యే వరకు పక్కాగా పర్యవేక్షిస్తున్నారు. పండగలు, ఇతర వేడుకల సమయాల్లో తానే స్వయంగా పిండి వంటలు తయారుచేసి వడ్డిస్తున్నారు. ఉపాధ్యాయులంతా పిల్లలతో కలిసి తింటున్నారు. ఎవరూ భోజనం వృథా చేయకుండా అవగాహన కల్పిస్తున్నారు.

**తాజా కూరగాయలతో..**

సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం బొర్రగూడెం ప్రాథమిక పాఠశాలలో 130 మంది విద్యనభ్యసిస్తున్నారు. ఇక్కడ మధ్యాహ్న భోజనం మొదలైనప్పటి నుంచి స్థానికురాలు ఎల్లమ్మ వంట నిర్వాహకురాలు కొనసాగుతున్నారు. నిత్యం తాజా కూరగాయలనే కొనుగోలు చేసి తీసుకొస్తారు. వంటగది, భోజనశాలను శుభ్రంగా ఉంచుతున్నారు. ఉపాధ్యాయులూ విద్యార్థులతో కలిసే భోజనం చేస్తుంటారు. ప్రతి సమావేశంలో తల్లిదండ్రులు ఎల్లమ్మను మెచ్చుకుంటున్నారు.

**పక్కా పర్యవేక్షణతో..**

వికారాబాద్ జిల్లా బొంరాస్‌పేట జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందుతోంది. 652 మంది ఇక్కడ చదువుకుంటున్నారు. విద్యాసంవత్సరం ప్రారంభంలో సగం మంది మాత్రమే భోజనం చేసేవారు. నాణ్యత లోపమే కారణమని గమనించిన ఉపాధ్యాయులు ఈ పరిస్థితిలో మార్పు తీసుకొచ్చేందుకు నడుంబిగించారు. నిత్యం నలుగురు ఉపాధ్యాయులు వంతులవారీగా భోజనం వండే సమయంలో పక్కాగా పర్యవేక్షిస్తున్నారు. విదార్థులతో కలిసి తింటున్నారు. దీంతో క్రమంగా నిత్యం భోజనం చేస్తున్న వారి సంఖ్య పెరిగింది.

**బడి తోటలో పండించినవే..**

ప్రభుత్వం గతంలో బడి తోటలను ప్రోత్సహించింది. దీన్ని చక్కగా ఉపయోగించుకున్న సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండలం రుద్రారంలోని ప్రాథమిక పాఠశాల నిర్వాహకులు విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందిస్తున్నారు. బడి ఆవరణలో కరివేపాకు, మునగ, టమాట, వంగ, గోంగూర, పాలకూర తదితర మొక్కలను నాటారు. వాటి పోషణ బాధ్యతలను పిల్లలు, ఉపాధ్యాయులు చూసుకుంటున్నారు. రసాయనాల జోలికి వెళ్లకుండా సేంద్రియ ఎరువులనే వాడుతున్నారు. నిత్యం ఈ తోట నుంచే కూరగాయలను కోసి మధ్యాహ్న భోజనానికి వినియోగిస్తున్నారు. సరకులు నాణ్యంగా ఉండేలా పర్యవేక్షిస్తున్నారు.

**ఉపాధ్యాయులు.. విద్యార్థులతో కలిసి..**

మెదక్ జిల్లా వెల్దుర్తి మండలం కుకునూర్ ఉన్నత పాఠశాలలో రుచికి, శుచికి ప్రాధాన్యం ఇస్తుండటం విశేషం. ప్రధానోపాధ్యాయుడు సీతారాం.. ఉపాధ్యాయులతో కలిసి ప్రత్యేక చొరవ చూపుతున్నారు. నిత్యం వంట నిర్వాహకులు భోజనం సిద్ధం చేసే సమయంలో మూడు సార్లు పరిశీలిస్తున్నారు. వంటశాల, భోజనశాల శుభ్రత విషయంలో రాజీ పడటం లేదు. రుచి బాగా లేకపోతే సూచనలు ఇస్తున్నారు. ప్రభుత్వం నిర్దేశించి పట్టిక ప్రకారం భోజనం పక్కాగా అందిస్తున్నారు. సరకులను నాణ్యమైనవి మాత్రమే వినియోగించేలా చూస్తున్నారు.

# తగ్గని వ్యాధులు.. పెరగని వసతులు



కరీంనగర్ : కరీంనగర్ జనరల్ ఆసుపత్రికి జ్వర బాధితుల తాకిడి తగ్గడం లేదు. గత జూన్ నుంచి మొదలైన వ్యాధులు ఇప్పటికీ వదలడంలేదు. ఇటీవల నాలుగైదు రోజులు వాతావరణంలో ఉష్ణోగ్రతలు పడిపోవడంతో జ్వర బాధితులు మరింత పెరిగారు. ఆసుపత్రి సామర్థ్యం 350 పడకలు కాగా, ప్రతి రోజు వచ్చే రోగుల సంఖ్య 800కు పైగానే ఉంటున్నారు. అసలే జ్వరాలతో సతమతమవుతున్న వారికి ఇక్కడి సౌకర్యాలు మరింత ఇబ్బందికి గురి చేస్తున్నాయి. సహాయకులు లేకపోతే ఓపీ నుంచి డాక్టర్ చూపించుకున్న తర్వాత రక్త పరీక్షలు, మందుల వద్ద లైన్లో నిల్చోవడం కష్టంగా మారింది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఇబ్బందులు లేకుండా సరైన సౌకర్యాలు కల్పించాలని రోగులు, సహాయకులు కోరుతున్నారు.

**మందుల పంపిణీ కేంద్రం వద్ద గొడవలు**

ఆసుపత్రికి వందల సంఖ్యలో రోగులు వస్తుంటే, మందులు పంపిణీ చోట ఒకరిద్దరు ఉండటంతో అధిక సమయం పడిగాపులు కాయాల్సి వస్తోంది. కొందరు లైనులో కాకుండా నేరుగా మందుల కౌంటర్ వద్దకు వచ్చేసరికి అక్కడ గొడవలు జరుగుతున్నాయి రెండు, మూడు గొడవలు జరిగాయి. వాటిని అడ్డుకునేందుకు భద్రత సిబ్బంది లేకపోవడం గమనార్హం. అవుట్‌పోస్టుకు కేటాయించిన పోలీస్ సిబ్బంది కూడా జన సంచారం, రద్దీ అధికంగా ఉన్నచోట ఉండకుండా వారి గదికే పరిమితమయ్యారని విమర్శలున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అక్కడ మరో ఇద్దరిని నియమించి మందులు త్వరితగతిన అందించే ఏర్పాట్లు చేయాలి.

**ఎక్కువ మందికి రక్తహీనత సమస్య -డాక్టర్ సతీష్‌రావు, ఊపిరితిత్తుల వైద్యులు**

ఆసుపత్రికి చాలామంది రక్తహీనత సమస్యతో వస్తున్నారు. అందరూ పోషకాహారం తీసుకోవాలి. కోడిగుడ్డు, ఆకుకూరలు, పాలు, కూరగాయలు, పప్పులు క్రమంగా తీసుకోవాలి. చలితో దగ్గు, జలుబు, జ్వరం, దమ్ముతో వస్తున్నారు. చలి అధికంగా ఉన్నప్పుడు బయటకు రాకపోవడం మంచిది. దూర ప్రయాణాలు చేయకూడదు. పొగ, దుమ్ముకు దూరంగా ఉండాలి. తప్పనిసరైతే మాస్కు ధరించాలి. క్షయ వ్యాధిగ్రస్థులు తప్పనిసరిగా మందులు వాడాలి. రెండు వారాలపాటు ఉంటే తెమడ పరీక్ష చేయించుకోవాలి. జలుబు, జ్వరం అధికంగా ఉంటే వైద్యులను సంప్రదించాలి.

**అదనపు సిబ్బందిని నియమిస్తాం- డాక్టర్ వీరారెడ్డి, ఆసుపత్రి సూపరింటెండెంట్**మందులు పంపిణీ కేంద్రంలో నలుగురు సిబ్బంది పని చేస్తున్నారు. సంబంధిత విభాగం వారితో మాట్లాడి మరో ఇద్దరి సిబ్బందిని అదనంగా నియమిస్తాం. రోగులకు ఇబ్బందులు లేకుండా మందులు పంపిణీ చేస్తాం.

# సకల జనుల బతుకు చక్రం



చౌటుప్పల్ : చౌటుప్పల్‌లో జరిగే వారసంత ఓ మినీ ఇండియాను తలపిస్తోంది. ఆ రోజున సంతలో సందడే సందడి. అన్ని కులాలు, మతాలు, పలు ప్రాంతాలకు చెందినవాళ్లు ఇక్కడే కనిపిస్తారు. ఒకరు అచ్చ తెలుగులో, మరొకరు హిందీలో, ఇంకొకరు ఒరియాలో ఇలా.. విభిన్న భాషల మాటలు ఇక్కడ విన్పిస్తుంటాయి. వాళ్లు ధరించిన దుస్తులు, వేషధారణ, ఆహార్యం విభిన్నంగా వారి సంస్కృతి, సంప్రదాయాలకు అనుగుణంగా దర్శనమిస్తుంది.సంతకొచ్చే వివిధ రాష్ట్రాల వారికి వారంలో ఆ ఒక్కరోజు ఆటవిడుపే. సంతలో రోడ్డు పక్కన అమ్మే జీన్స్ ప్యాంట్లు, టీషర్టులు, చీరలు కొనేందుకు మగవాళ్లు, ఆడవాళ్లు పోటీపడుతుంటారు. అరుగులపై కూర్చొని ఐస్‌క్రీములు తింటూ, పళ్ల రసాలు తాగుతూ సేద తీరతారు. చేతులపై 'టాటూలు వేయించుకొని మురిసిపోతుంటారు. భుజాలపై చేతులేసుకుని హుషారుగా సంతలో చక్కర్లు కొడతారు. చివరికి.. వారానికి సరిపడా కిరాణ సరకులు, కూరగాయలు కొనుక్కొని ఆ మూటలను నెత్తినెత్తుకొని సాయంత్రానికల్లా నివాసాలకు తిరిగి వెళ్లిపోతారు. దేశం నలుమూలల నుంచి వచ్చిన పది వేల మందికి పైగా ప్రజలు చౌటుప్పల్ మండల పరిధిలో ఉపాధి పొందుతూ ఇక్కడే నివాసముండడం విశేషం.

**పది వేల మందికి ఇక్కడే ఉపాధి..**

మండల పరిధిలో యాభై వరకు చిన్నవీ, పెద్దవీ ఫార్మా, ఇతర పరిశ్రమలున్నాయి. వీటిలో వివిధ ప్రాంతాలవారు పది వేల మందికి పైగా ఉపాధి పొందుతున్నారు. లింగోజీగూడెంలోని దివిస్ లేబోరేట రీస్‌లో అయిదు వేల మంది ఉద్యోగులుంటే అందులో తొంభై శాతం ఏపీ వాళ్లున్నారు. స్థానిక కంపెనీల ఉద్యోగులు చాలా వరకు ఇక్కడే స్థిరపడుతున్నారు. దివిస్ కంపెనీ ఉద్యోగుల పేరిట చౌటుప్పల్ పట్టణంలో ఓ కాలనీ సైతం నిర్మాణమైంది.ఫార్మా కంపెనీలు ఏజెన్సీల ద్వారా ఉద్యోగుల నియామకం చేస్తుంటా యి. వారి ప్రకటనలు చూసి గుజరాత్, మహారాష్ట్ర, బిహార్, ఒడిశా, హరియాణా, జమ్మూ కశ్మీర్ రాష్ట్రాలకు చెందినవారు ఎక్కువగా ఉద్యోగులుగా చేరుతున్నారు. అన్ని పరిశ్రమల్లో, నిర్మాణ రంగంలో, హమాలీలుగా, బరువులెత్తే కార్మికులుగా బిహార్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, అసోం వారు పనిచేస్తున్నారు.మండల పరిధిలోని పెద్దకొండూరు, చిన్నకొండూరు, మల్కాపురం, తాళ్లసింగారం, లింగోజీగూడెం తదితర గ్రామాల్లోని భారీ ఇటుక బట్టీల్లో ఒడిశా కార్మికులు పని చేస్తున్నారు. లేబర్ కాంట్రాక్టర్ల ద్వారా ఈ కూలీలు ఇక్కడికొస్తున్నారు. వాళ్లు వలస కార్మికులకు ఉపాధి చూపించి కొంత కమీషన్ తీసుకుని వేతనాలు చెల్లిస్తున్నారు.పరిశ్రమల యాజమాన్యాలు కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు కల్పిస్తున్నాయి. కొన్ని కంపెనీలు రేకుల షెడ్డులు నిర్మించి వసతి కల్పిస్తున్నారు. గుజరాత్ వాళ్లు ఇక్కడ అన్నిరకాల వ్యాపారాలు, కేరళ, కర్ణాటక వాళ్లు హొటళ్లు నిర్వహిస్తున్నారు. అసోం, నేపాలీలు సెక్యూరిటీ గార్డులుగా పనిచేస్తున్నారు. కేరళ టీచర్లు ఇక్కడి పాఠశాలల్లో ఉపాధ్యాయులుగా ఉన్నారు.

**ఏయే రాష్ట్రాలవాళ్లంటే?**

ఆంధ్రప్రదేశ్, ఒడిశా బిహార్, ఛత్తీస్‌గఢ్, అసోం, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, గుజరాత్, హరియాణా, జమ్మూ-కశ్మీర్, కర్ణాటక, కేరళ

వాళ్ల పిల్లలు అంగన్‌వాడీల్లో.. పాఠశాలల్లోవలస కార్మికులు తమ పిల్లలను వారు పనిచేస్తున్న గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో, అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పిస్తున్నారు. ఏ ధ్రువపత్రం అవసరం లేకుండా ఆధార్ కార్డుతో వీళ్లను చేర్చుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించడంతో ఈ సౌకర్యాన్ని వినియోగించుకుంటున్నారు. మధ్యాహ్న భోజనం, ఇతర సదుపాయాలు ఉచితంగా పొందుతున్నారు. పిల్లలు వారి మాతృభాషలో కాకుండా తెలుగు, ఆంగ్ల మాధ్యమాల్లో అక్షరాభ్యాసం చేస్తున్నారు.

# మార్పు వైపు.. యువత అడుగులు

మిర్యాలగూడ : చెడు అలవాట్లు, ప్రణాళిక లేని ఆహార, నిద్ర సమయాలతో నేటి యువత అనేక అనారోగ్య సమస్యల బారిన పడుతున్నారు. ఉమ్మడి జిల్లాలో అనేక మంది యువత 35 ఏళ్ల లోపే మధుమేహం, రక్తపోటు, థైరాయిడ్, క్యాన్సర్ వంటి వ్యాధులకు గురవుతున్నారు. కిడ్నీ, కాలేయ సంబంధిత సమస్యలతో పాటు ఊబకాయం వంటి వాటిని ఎదుర్కొంటున్నారు. వీటి బారి నుంచి కాపాడుకునేందుకు యువత ఇటీవల వ్యాయామంతో పాటు ప్రత్యేక ఆహార అలవాట్ల కోసం నిపుణులను సంప్రదిస్తున్నారు.

**ఏడు లక్షలకు పైగా యువత..**

ఉమ్మడి జిల్లాలో సుమారు ఏడు లక్షలకు పైగా యువత ఉన్నారు. వీరిలో సుమారు 20 శాతం మందికి పైగా వివిధ వ్యాధులు, ఊబకాయం, అధిక బరువుతో బాధ పడుతున్నారు. పుట్టుకతో వచ్చే మధుమేహ



వ్యాధిగ్రస్థులను మినహాయిస్తే.. వయసుకు తగిన బరువు కంటే ఎక్కువ ఉన్న వారు సుమారు 40 శాతం మంది ఉన్నట్లు నిపుణులు అంచనా వేస్తున్నారు.పలు వ్యాధుల నియంత్రణతో పాటు ఊబకాయం, అధిక బరువును తగ్గించుకునేందుకు ఆహార ప్రణాళిక, వ్యాయామం చేయడం ముఖ్యమే. కరోనా అనంతరం అనేక మందిలో వ్యాయామంపై అవగాహన పెరిగింది.

వైద్యులు సైతం నిత్యం కనీసం గంట పాటు వ్యాయామం చేయాలని సూచిస్తున్నారు. దీంతో అన్ని పట్టణాల్లో ప్రభుత్వ వ్యాయామశాలలతో పాటు ప్రైవేట్ ఆధ్వర్యంలో అధునాతన వ్యాయామశాలలు వెలవడంతో పాటు ప్రత్యేక శిక్షకులు సైతం అందుబాటులో ఉన్నారు.

**శరీరతత్వాన్ని బట్టి ప్రత్యేక డైట్‌లు**

యువత శరీరతత్వాన్ని వారి ఆరోగ్య సమస్యల ఆధారంగా ప్రత్యేక డైట్‌లు సిఫారసు చేస్తున్నారు. వీటిలో ప్రధానమైనవి కీటో, ఇంటర్ మిటెంట్ ఫాస్టింగ్, ఓ మ్యాడ్ వంటి పద్ధతులున్నాయి.

కీటో పద్ధతిలో పిండి పదార్థాలు పూర్తిగా తగ్గించి.. కేవలం అధిక కొవ్వు, అధిక ప్రొటీన్‌లు ఉన్న ఆహారాన్ని సిఫారసు చేస్తారు. ఇది అంత ఆరోగ్యకరమైంది కాదని నిపుణులు చెబుతున్నారు.

ఓ మ్యాడ్ విధానంలో 23 గంటల పాటు ఉపవాసం ఉండి ఒక గంటలో ఆ రోజుకు కావాల్సిన అన్ని రకాల పోషకాలు అందిస్తారు. ఇటీవల అత్యధిక మంది ఆచరిస్తున్న వాటిలో ఇంటర్‌మిటెంట్ ఫాస్టింగ్ ముఖ్యమైనది. దీంట్లో 16 గంటలు ఉపవాసం ఉండి.. 8 గంటలు ఆహారం తినడం, 12 గంటలు ఉపవాసం, 12 గంటలు భోజనం, వారంలో ఒకటి లేదా రెండు రోజుల ఉపవాసం వంటి మూడు రకాల పద్ధతులున్నాయి.

**కరోనా అనంతరం మార్పు**

తిరుపతి, వ్యాయామ శిక్షకుడు, మిర్యాలగూడ

వ్యాయామంపై కరోనా అనంతరం యువతలో చాలా మార్పు వచ్చింది. అనేక మంది యువత ఒక నెల క్రమం తప్పకుండా వ్యాయామం చేసి.. ఆ తర్వాత నిర్లక్ష్యం చేస్తున్నారు. అనేక మంది తమ వయసుకు మించి బరువుతో బాధ పడుతున్నారు. వీరికి ప్రత్యేక వ్యాయామాలతో పాటు ఆహారాన్ని సిఫారసు చేస్తున్నారు. ప్రస్తుతం జిమ్‌లో నిత్యం వంద మందికి పైగా యువత శిక్షణ పొందుతున్నారు.

**రోగిని బట్టి ఆహార పద్ధతులు**

జాహ్నవి, న్యూట్రిషనిస్టు, మిర్యాలగూడ

ప్రస్తుతం అనేక మంది యువత మద్యపానం, ధూమపానం వంటి దురలవాట్లతో పాటు క్రమపద్ధతి లేని ఆహారపు అలవాట్లతో పలు వ్యాధుల బారిన పడుతున్నారు. దీంతో వారి వ్యాధులు, శరీరతత్వాన్ని బట్టి ఆహార పద్ధతులు సూచిస్తున్నాం. ఎటువంటి వ్యాధులు లేకుండా ఊబకాయం, అధిక బరువు ఉన్న వారికి ఇంటర్‌మిటెంట్ ఫాస్టింగ్ విధానం బాగా పని చేస్తుంది.

# గ్రామాల్లో వడివడిగా.. పట్టణాల్లో మందకొడిగా

నల్గొండ : సమగ్ర కుటుంబ సర్వే జిల్లాలో చివరి దశకు చేరింది. ఎన్యుమరేటర్లు ఇంటింటికీ తిరిగి వివరాలు సేకరించారు. దాదాపు 22 రోజుల నుంచి సర్వే కొనసాగిస్తున్నారు. ఈ ప్రక్రియ పూర్తి అయిన మండలాలు, పురపాలికల్లో ఆన్‌లైన్ వివరాల నమోదు చేపట్టారు. నమోదు ప్రక్రియ కొన్ని మండలాల్లో చివరి దశకు చేరింది. దీనిని త్వరితగతిన పూర్తి చేయించేందుకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించి.. మండల, పురపాలిక కార్యాలయాల్లో ప్రత్యేకంగా సిబ్బందిని నియమించి వివరాలు కంప్యూటరీకరిస్తున్నారు.

**పూర్తి కాని సర్వే**

జిల్లాలో దేవరకొండ, శాలిగౌరారం మండలాల్లో.. నల్గొండ, దేవరకొండ పురపాలికల్లో ఇంకా సర్వే పూర్తి కాలేదు. సర్వే పూర్తి అయిన మండలాలు, పురపాలికల్లో వివరాలు నమోదు ప్రక్రియ చురుకుగా కొనసాగుతోంది. జిల్లాలో పట్టణాలు, గ్రామాల్లో కలిపి 5,09,562 కుటుంబాలు ఉన్నట్లు గుర్తించారు. సర్వే పూర్తయ్యే సమయానికి ఆ కుటుంబాల సంఖ్య పెరగడం విశేషం. 5,10,752 కుటుంబాల వివరాలు నమోదు దీనినే సూచిస్తున్నాయి. ఇందులో ఇప్పటికే 4,36,713 కుటుంబాలకు సంబంధించిన ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో 3,88,489, పట్టణ ప్రాంతాల్లో 48,224 కుటుంబాల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు ప్రక్రియ పూర్తి చేశారు. ఎంపీడీవో, తహసీల్దార్, పురపాలిక కార్యాలయాల్లో ఆన్‌లైన్‌లో నమోదు ప్రక్రియ నిర్వహిస్తున్నారు. **మొదట్లో జాప్యం.. తర్వాత వేగవంతం**

సమగ్ర సర్వే ప్రక్రియకు మొదట ఎక్కువ సమయం పట్టింది. ముందస్తు శిక్షణ తీసుకున్నప్పటికీ ఎన్యుమరేటర్లు తొలి రెండు, మూడు రోజులు ఇబ్బందులు పడాల్సి వచ్చింది. ఆ తర్వాత వేగం పెంచారు. గ్రామీణ ప్రాంతాల్లో సర్వే చకచకా ముందుకు సాగింది. పట్టణ ప్రాంతాల్లో ఇప్పటికి కొందరు వివరాలు నమోదు చేయించుకోకపోవడం గమనార్హం. ఆన్‌లైన్ ప్రక్రియలో ఆపరేటర్లు సందేహం వస్తే నివృత్తి చేసుకుంటూ నమోదు చేస్తున్నారు. ఆయా కుటుంబాల్లో ఇద్దరు ముగ్గురు సభ్యులుంటే వివరాల నమోదుకు 15 నిమిషాలు, అయిదుగురుంటే 20 నిమిషాలు.. ఏడుగురు అంతకంటే ఎక్కువ ఉంటే అరగంట వరకు సమయం పడుతోందని ఆపరేటర్లు పేర్కొంటున్నారు. ఒక కుటుంబ వివరాలు నమోదుకు రూ.30 చొప్పున చెల్లిస్తున్నామని అధికారులు పేర్కొంటున్నా.. అధికంగా ఇవ్వాలని ఆపరేటర్లు కోరుతున్నారు.

# పాడి పశువులెన్ని.. గుర్రాలున్నాయా!?

సిరిసిల్ల : పశుగణన కార్యక్రమాన్ని జిల్లాలో నిర్వహించడానికి పశుసంవర్ధకశాఖ అధికారులు కార్యాచరణ సిద్ధం చేశారు. నాలుగు నెలల పాటు నిర్వహించనున్న ఈ గణనలో పాడి పశువులు, గొర్రెలు, మేకలు, పందులు, గుర్రాలు, వీధి కుక్కలు, పెంపుడు కుక్కలు, పిల్లులు తదితర జంతువులను వాటి జాతుల వివరాలతో పాటు కోళ్ల లెక్కను పక్కాగా సేకరించనున్నారు. ప్రతి 5 సంవత్సరాలకు ఒకసారి ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. ఇందులో భాగంగా జిల్లాలో ఈ కార్యక్రమం నిర్వహణకు అంతా పూర్తి చేశారు. త్వరలో ప్రారంభించనున్నారు. దేశం మొత్తంలో ఎంత పశుసంపద ఉంది అనేది పశుగణన ద్వారా లెక్కిస్తారు.మాంసం, గుడ్లు ఉత్పత్తి, వాటి ద్వారా వచ్చే ఆదాయం ఎంత, దేశంలోని జనాభాకు ఇవి సరిపోతాయా, లేదా, దీనిని బట్టి ఇతర దేశాలకు ఎగుమతి చేసేందుకు అవకాశం ఉందా, లేదా, ఇతర దేశాల నుంచి మనదేశానికి దిగుమతి చేసుకోవడం కోసం లెక్కలు వేసి, ప్రణాళికలు సిద్ధం చేయడానికి ఇది ఉపయోగపడుతుంది.

చరవాణిలో యాప్ డౌన్‌లోడ్ చేసుకొని...

పశుగణన కోసం జిల్లాలో ఎంపిక చేసిన ఎన్యూమరేటర్ల వివరాలను జిల్లా అధికారులు కేంద్ర ప్రభుత్వానికి పంపించారు. పశుగణనకు సంబంధించిన 21వ లైవ్‌స్టాక్ సెన్సెస్ యాప్‌ను చరవాణిలో ప్లేస్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలి. వెంటనే అతనికి యూజర్‌నేమ్‌తోపాటు పాస్‌వర్డ్ మెసేజ్ వస్తుంది. వాటిని నమోదు చేయగానే దాని కింది భాగంలో యూజర్‌నేమ్‌తో పాటు పాస్‌వర్డ్ ఉంటుంది. క్రియేట్ యువర్ న్యూ యూజర్‌నేమ్, పాస్‌వర్డ్ అని వస్తుంది. అప్పుడు ఎన్యూమరేటర్ నూతనంగా నమోదు చేయగానే ఆ యాప్ ఓపెన్ అవుతుంది. అప్పుడు వివరాల నమోదు ప్రారంభమవుతుంది. దీంతో ఏ ఒక్క ఎన్యూమరేటరు కూడా ఇతరుల యాప్‌ను ఓపెన్ చేయడానికి ప్రయత్నించినా, యూజర్ నేమ్‌గాని, పాస్‌వర్డ్‌గాని ఉపయోగించినా సంబంధిత ఎన్యూమరేటర్‌కు




తెలిసిపోతుంది. పశుగణన పూర్తి చేసిన తర్వాత వాటిని అప్‌లోడ్ చేయగానే సంబంధిత మండల సూపర్‌వైజర్‌కు, జిల్లా అధికారికి, అక్కడి నుంచి రాష్ట్ర, కేంద్ర అధికారులకు వెళతాయి. అధికారులు వారి స్థాయిలో పరిశీలించి ఆమోదించిన తర్వాతనే రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలకు సమాచారం చేరుతుంది.

ఒక్కొక్కరు 4,500 ఇళ్ల వివరాల నమోదు

గ్రామాల్లో ప్రతి ఇంటికీ వెళ్లి పశువులతోపాటు ఇతర జంతువుల వివరాలను నమోదు చేయనున్నారు. ఇందుకు జిల్లాలో 51 మంది ఎన్యూమరేటర్లను నియమించారు. వీరంతా పశువైద్య సిబ్బంది కావడం, పశువులపై పూర్తి అవగాహన ఉండటంతో వివరాలను యాప్‌లో తొందరగా నమోదు చేసే అవకాశం ఉంటుంది.

ఒక్కో ఎన్యూమరేటర్‌కు 4,500 ఇళ్లు కేటాయించారు. ఒకవేళ జిల్లాలో ఉన్న ఇళ్ల సంఖ్యకు వీరు సరిపోకపోతే ప్రైవేటుగా ఇతరులను ఎంపిక చేసి వారికి శిక్షణ ఇచ్చి గణన చేయించనున్నారు.

ప్రస్తుతం పశువైద్య సిబ్బంది పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేస్తున్నారు. ఈ ప్రక్రియ చివరి దశలో ఉంది. ఇది పూర్తయిన తర్వాత పశుగణన కార్యక్రమం ప్రారంభించనున్నారు.

21వ అఖిల భారత పశుగణన కార్యక్రమం 2025 ఫిబ్రవరి వరకు కొనసాగనుంది. గడువులోగా పూర్తి చేస్తాం21వ అఖిల భారత పశుగణనను ప్రభుత్వం నిర్ణయించిన గడువులోగా పూర్తి చేస్తాం. దీనికోసం ఇప్పటికే ఎన్యూమరేటర్లతోపాటు మండల సూపర్‌వైజర్‌లు, జిల్లా స్థాయి అధికారులను ఎంపిక చేసి శిక్షణ ఇచ్చాం. ప్రస్తుతం సిబ్బంది పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేస్తున్నారు. ఇది త్వరలోనే పూర్తవుతుంది. పూర్తయిన వెంటనే పశుగణన కార్యక్రమం ప్రారంభిస్తాం.రవీందర్‌రెడ్డి, జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి

## కాళేశ్వరం డీపీఆర్‌ను కేసీఆర్ ఆమోదించారు: మాజీ ఈఎన్సీ వెంకటేశ్వర్లు



హైదరాబాద్: విశ్రాంత ఈఎన్సీ నల్లా వెంకటేశ్వర్లు కాళేశ్వరం కమిషన్ ముందు విచారణకు హాజరయ్యారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలకు సంబంధించిన అంశాలపై విచారణ సాగింది. కాళేశ్వరం డీపీఆర్‌ను అప్పటి సీఎం కేసీఆర్ ఆమోదించినట్లు విచారణ సందర్భంగా వెంకటేశ్వర్లు కమిషన్ దృష్టికి తీసుకెళ్లారు. ఇందుకు సంబంధించిన దస్త్రాలను కమిషన్‌కు అందించారు. కాళేశ్వరం డిజైన్లను ఫైనల్ చేయమని కేసీఆర్ చెప్పినట్లు వెంకటేశ్వర్లు తెలిపారు. మినిట్స్‌కు సంబంధించిన దస్త్రాలు, మూడు బ్యారేజీల వివరాలను సమర్పించారు. మేడిగడ్డ కుంగుబాటుకు నిర్వహణ లోపమే కారణమా? మూడు బ్యారేజీల్లో నీరు నింపాలని ఎవరు ఆదేశించారని కమిషన్ ప్రశ్నించినట్లు తెలుస్తోంది. దీనికి అప్పటి ప్రభుత్వాధినేత ఆదేశించారని వెంకటేశ్వర్లు బదులిచ్చినట్లు సమాచారం.

# మానసిక కల్లోలం



హైదరాబాద్ : చాలామందిని చిన్న వయసులోనే మానసిక సమస్యలు వెంటాడుతున్నాయి. ఎర్రగడ్డ మానసిక చికిత్స కేంద్రానికి నిత్యం పాత, కొత్త కలిపి 540 మంది వరకు ఓపీకి వస్తుండగా.. ఇందులో 18–30 ఏళ్లలోపు వారు దాదాపు 30–35 శాతం వరకు ఉంటున్నారని వైద్యులు పేర్కొంటున్నారు. ఎక్కువ మంది కుంగుబాటు, ఆతృత, బైపోలార్ లాంటి సమస్యలకు లోనవుతున్నారు. తల్లిదండ్రుల తగాదాలు, ఒంటరి తనం, ప్రేమ వైఫల్యం తదితర కారణాలతో మత్తుకు బానిసలుగా మారి మానసిక రుగ్మతల బారిన పడుతున్నారు.

ఉరుకుల పరుగులు జీవితంలో చాలా కుటుంబాల్లో పిల్లలను సైతం పట్టించుకోని పరిస్థితి. భార్యభర్తలు విడిపోవడం, పిల్లల ఎదుటే గొడవపడటం ఫలితంగా తాము ఒంటరి అనే భావనతో ఎక్కువ మంది యువత పక్కదారి పడుతున్నారు. ఇంటర్, డిగ్రీలోనే మత్తుకు బానిసలవుతున్నారు. మానసిక సమస్యలతో వచ్చే యువతలో ఎక్కువ మంది గంజాయి ఇతర మత్తు మందుల బాధితులేనని పేర్కొంటున్నారు. మానసిక సమస్యలకు సంబంధించి లక్షణాలు బట్టి ఔషధాలు ఇవ్వడంతోపాటు 6–8 వారాలపాటు కౌన్సిలింగ్ ద్వారా మానసిక చికిత్సలు చేస్తామని ఎర్రగడ్డ మానసిక ఆరోగ్య కేంద్రం సూపరింటెండెంట్ డాక్టర్ ఆర్.అనిత తెలిపారు.

కొన్ని మానసిక సమస్యలు ఇలా... ఆతృత (యాంగ్జైటీ)

ఆతృత అనేది ఆందోళన కలిగించే తీవ్రమైన భావన. తేలికపాటిగా, తీవ్రంగా...కొన్నిసార్లు భయాందోళన కలిగించే వివిధ స్థాయిలో ఉంటుంది. అనవసర భయాలు, భావోద్వేగ సమస్యలు, అనారోగ్యం, మత్తు పదార్థాలు తీసుకోవడం, లేనిది ఉన్నట్లుగా ఊహించుకోవడం. దెదడ, చంచలత్వం, భయం, ఎక్కువగా చమటలు పట్టడం, వికారం, అతిమూత్ర విసర్జన, నిద్రలేమి లక్షణాలు.

కౌన్సిలింగ్‌తో ఈ ఆతృత సమస్యను తగ్గిస్తారు. ఔషధాలు క్రమం తప్పకుండా వాడాలి. జీవనశైలిలో మార్పులు సైతం బాగా ఉపయోగపడతాయి.

కుంగుబాటు (డిప్రెషన్)

అంతర్లీనంగా ఉన్న దుఃఖంతో ఈ సమస్య ప్రారంభమవుతుంది. కారణం లేకుండా ఏడుస్తూ ఉంటారు. రెండు వారాలుగా బాధపడటం, అలసట, పనిలో ఆసక్తి తగ్గిపోవడం, ఆకలి మందగించడం, నిద్రలేమి లక్షణాలు ఉంటాయి.

కుటుంబంలో తగాదాలు, జన్యుపర అంశాలు, కొన్ని రకాల మందులు, వ్యసనాలు, బంధువులు, కుటుంబ సభ్యుల మరణం, దీర్ఘకాలిక అనారోగ్యాలు కుంగుబాటుకు ప్రధాన కారణాలు.

జీవనశైలిలో మార్పులు, వ్యాయామం, ఆహార ప్రణాళికలో మార్పులు, సరైన నిద్ర, ఆలోచనల్లో మార్పులు, ఆశావాద దృక్పథం, ఔషధాలు, కాగ్నిటివ్ బిహేవియర్ థెరపీ, ఇంటర్ పర్సనల్ థెరపీతో కుంగుబాటు నయం చేయవచ్చు.

బైపోలార్ డిజార్డర్

ఈ రుగ్మత కారణంగా మానసిక అసమతుల్యతలు విపరీతంగా ఉంటాయి. ఎక్కువ సంతోషం, అతిబాధతో కుంగిపోతుంటారు. చాలామందిలో ఈ రుగ్మత వారాలు లేదా నెలలు ఇంకా ఎక్కువ కాలమే ప్రభావం చూపుతుంది.

తనను తాను చాలా శక్తిమంతుడిగా భావిస్తుంటారు. అన్ని పనులు చాలా వేగంగా చేస్తారు. గొప్పగొప్ప ఆలోచనలు చేస్తూ...తాము ఏదైనా సాధిస్తామని చెబుతుంటారు. ఆచరణలో మాత్రం సాధ్యం కాదు. అసందర్భ ప్రేలాపనలతో మంచి చెడుల మధ్య విచక్షణ కోల్పోతారు. ఈ వ్యాధికి మందులు వైద్యుల సూచనలతో వాడాలి. సరైన కౌన్సిలింగ్, జీవనశైలి మార్పుతో సులువుగా సమస్య నుంచి బయట పడవచ్చు.

స్కిజోఫినియాజి

ఇది ఒక తీవ్రమైన మానసిక సమస్య. 1–2 శాతం మందిలో ఈ మానసిక రుగ్మత కన్పిస్తుంది. తనలోతాను నవ్వుకోవడం, మాట్లాడుకోవడం, తన ప్రపంచంలో తానే బతకడం, తనపై ఎవరో చేతబడి చేస్తున్నారని ధృడంగా నమ్మడం, ఎవరికి వినిపించని మాటలు తనకు వినిపించడం, ఒంటరిగా, మౌనంగా ఉండటం ఈ వ్యాధి ప్రధాన లక్షణాలు

ఆరంభ దశలో వ్యాధిని గుర్తించి చికిత్స అందించడం చాలా అవసరం. మందులతోపాటు సైకోథెరపీతో వైద్యులు చికిత్స అందిస్తారు. క్రమం తప్పకుండా చికిత్స తీసుకోవడం ద్వారా లక్షణాలను క్రమేపీ తగ్గించవచ్చని వైద్యులు తెలిపారు.

# అటకెక్కిన ఆపరేషన్ రోప్



హైదరాబాద్ : సీఎం ఆదేశించినా.. సీపీ హెచ్చరిస్తున్నా.. హైడ్రా రంగంలోకి దిగినా నగరంలో ట్రాఫిక్ కష్టాలు తీరడం లేదు. ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్లు, కార్యాలయాల నుంచి బయటకు వచ్చి రద్దీని అదుపుచేయాలన్న ఉన్నతాధికారుల ఆదేశాలు అమలుకు నోచుకోవట్లేదు. బంజారాహిల్స్, ఆబిడ్స్, చాదర్‌ఘాట్, సికింద్రాబాద్ వంటి ప్రధాన మార్గాల్లో అర్ధరాత్రి వరకు పాన్ దుకాణాలు, ఐస్‌క్రీమ్ పార్లర్ల బయట వాహనాలు నిలుపుతున్నా చూసీచూడనట్టు వదిలేస్తున్నారు.

సమన్వయలోపం.. రెండేళ్ల కిందట.. సమున్నత లక్ష్యంతో చేపట్టిన 'ఆపరేషన్ రోప్' అమలుకు నోచుకోవట్లేదని ఉన్నతాధికారులే అంగీకరిస్తున్నారు. నగరంలో పెరుగుతున్న ట్రాఫిక్ సమస్య, వాహనాల రాకపోకలు సాఫీగా సాగేందుకు 2022లో ఆపరేషన్ రోప్(రోడ్ అబ్‌స్ట్రక్టివ్ పార్కింగ్ అండ్ ఎంక్రోచ్‌మెంట్) అమలుల్లోకి తెచ్చారు. రహదారి భద్రతే లక్ష్యంగా చేపట్టిన ఈ కార్యక్రమం మంచి ఫలితాలనిచ్చింది. నగరంలో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో 2021లో 323 మంది మృతిచెందగా.. 2022లో 275, 2023లో 280 మంది.. ఇలా మృతుల సంఖ్య తగ్గటం ఆపరేషన్ రోప్ సానుకూల ఫలితాలకు నిదర్శనం. ఉన్నతాధికారుల మారడంతో లక్ష్యం అటకెక్కింది. సరిహద్దు కమిషనరేట్లు, రవాణా శాఖల అధికారులతో సమన్వయ లోపం సమస్యను మరింత జఠిలంగా మారుస్తోంది.

ఆక్రమణలు, అక్రమ పార్కింగ్‌లతోనే..

మలక్‌పేట్ – ఎర్రగడ్డ, మాసబ్‌ట్యాంక్ – షేక్‌పేట్, మైత్రివనం–బేగంపేట్, సికింద్రాబాద్–తార్నాక పంజాగుట్ట–బంజారాహిల్స్ నిత్యం రద్దీగా ఉండే మార్గాలు. ఇలాంటి దారులకు ఇరువైపులా తోపుడుబండ్లు ఆక్రమించాయి. దుకాణాలకు వచ్చే కొనుగోలుదారులు నిలిపిన కార్లు, ద్విచక్ర వాహనాలతో నిండిపోతున్నాయి. దుకాణం ఎదురుగా ఉన్న పాదచారి మార్గాలను అద్దెకిచ్చి సొమ్ము చేసుకుంటున్నారు. 4లక్షలకు పైగా ఉన్న ఆటోలపై నియంత్రణ కొరవడింది. ఇటీవల ట్రాఫిక్ పోలీసులు ఎస్సార్‌నగర్, అమీర్‌పేట్, మైత్రివనం ప్రాంతాల్లో కేవలం 2 గంటల తనిఖీల్లో 100కు పైగా ఆక్రమణలు తొలగించారు. అత్తాపూర్–మెహిదీపట్నం మార్గంలో రాంగ్‌రూట్‌లో ప్రయాణిస్తున్న 350 ద్విచక్ర వాహనాలపై కేసులు నమోదుచేశారు. ఉల్లంఘనులను దారికి తీసుకొచ్చేందుకు తనిఖీల ప్రక్రియను నిరంతరం కొనసాగించడంతో ట్రాఫిక్ ఇబ్బందులు అధిగమించాలని భావిస్తున్నారు.

# ప్రభుత్వోద్యోగుల పాఠశాల బాట

ఖమ్మం : ఇటీవల నిర్వహించిన డీఎస్సీ పరీక్షలో వివిధ శాఖల ప్రభుత్వ ఉద్యోగులు సైతం ఎంపికయ్యారు. జిల్లాలో సంక్షేమ గురుకుల విద్యాలయాలు, పంచాయతీ కార్యదర్శులు, పోలీసుశాఖలో పని చేస్తున్న కానిస్టేబుళ్లు, న్యాయశాఖతో పాటు ఇతర శాఖల్లో ఇప్పటికే పని చేస్తున్న సుమారు 100 మందికి పైగా ఉద్యోగులు ఆయా శాఖల నుంచి ఉపాధ్యాయ వృత్తిలోకి వచ్చినట్లు తెలుస్తోంది. భావి పౌరులను తయారు చేసి గురుతర బాధ్యతలపై ఎక్కువ మంది ఆసక్తి చూపినట్లు తెలుస్తోంది. రెండు మూడేళ్ల సర్వీసు సైతం వదులుకోవడం గమనార్హం.గురుకులాల నుంచి అత్యధికంగా..

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకులాల ఆధ్వర్యంలో జిల్లాలో పలు విద్యా సంస్థలను ప్రభుత్వం నిర్వహిస్తోంది. గత ఏడాది వీటిలో రెగ్యులర్ ఉపాధ్యాయ పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేశారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లోని సంస్థల్లో వందల సంఖ్యలో పరీక్ష రాసి ఉత్తీర్ణులైన వారిని ఉపాధ్యాయులుగా నియమించారు. ఇవే సంస్థల్లో పని చేస్తున్న వందల మంది ఉపాధ్యాయులు విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన డీఎస్సీ పరీక్షకు దరఖాస్తు చేసుకున్నారు. ఈ పరీక్షలోనూ తమ సత్తాచాటి ఎంపికయ్యారు. ఇలా ఖమ్మం జిల్లాలో సుమారు 65 మంది, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 42 మంది ఎంపికైనట్లు సమాచారం. వీరంతా ప్రభుత్వం పాఠశాలల్లో చేరటంతో గురుకుల విద్యాలయాల్లో చాలా వరకు పోస్టులు ఖాళీ అయ్యాయి.

వేతనం ఎక్కువే...గురుకుల విద్యాలయాల్లో పని, వేతనం ఎక్కువే. గురుకులాల్లో టీజీటీ వేతనం ప్రభుత్వ పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్‌తో, పీజీటీ వేతనం జూనియర్ లెక్చరర్ వేతనం అంత ఉంటుంది. రెండు, మూడు ఇంక్రిమెంట్లు సైతం ఉంటాయి. గురుకులాల్లో బోధనతో పాటు బోధనేతర పనులు చేయాల్సి




ఉంటుంది. వరుసల వారీగా వారంలో రెండు మూడు రోజులు వార్డెన్ బాధ్యతలు నిర్వహించాలి. వీటికి తోడు పగలు, రాత్రి స్టడీ అవర్స్, సెలవు దినాల్లో విధులు, హౌస్ మాస్టర్, రాత్రి కేర్ టేకర్ బాధ్యతలు నిర్వహించాలి. రాత్రంతా విధులు నిర్వహించి ఉదయం 8.00 గంటల వరకు తిరిగి విధులకు హాజరు కావాల్సి ఉంటుంది. బోధనతో పాటు అదనపు బాధ్యతల వల్ల మహిళా ఉపాధ్యాయులు ఇబ్బందులకు గురవుతున్నారు.

అతిథి అధ్యాపకుల ఆవేదన..

గురుకులాల్లో రెగ్యులర్ ఉపాధ్యాయుల నియామకంతో గెస్ట్ లెక్చరర్లకు ఉద్వాసన పలికారు. ప్రస్తుతం డీఎస్సీతో ఖాళీలు ఏర్పడినందున తిరిగి విధుల్లో తీసుకోవాలని వారంతా కోరుతున్నారు.

# కుక్కల కు.ని.కి రూ.70 లక్షలా?

జగిత్యాల : జగిత్యాల పట్టణంలో కుక్కల బెడద నివారించేందుకు బల్దియా సాధారణ నిధులు రూ.70 లక్షలు కేటాయించింది. వార్డుల్లో విచ్చలవిడిగా తిరుగుతూ ప్రజలపై దాడులకు పాల్పడుతున్న కుక్కలను పట్టుకొని వాటికి కుటుంబ నియంత్రణ (కు.ని.) శస్త్రచికిత్స చేపట్టే కార్యక్రమం చేపట్టారు. ఇందుకోసం హైదరాబాద్‌కు చెందిన ఎనిమల్ వెల్ఫేర్ సొసైటీ బృందాన్ని నాలుగు నెలల క్రితం రప్పించారు. ఒక్కో కుక్కను పట్టుకొని కు.ని. అనంతరం వదిలేసేందుకు రూ.200, కు.ని.కి ముందు, తరువాత వాటి పర్యవేక్షణ, ఫీడింగ్ తదితరాల కోసం రూ.1,450 చొప్పున చెల్లించేందుకు నిర్ణయించారు. ఈ మేరకు వార్డుల్లోని కుక్కలను పట్టుకొని నూకపల్లిలోని జంతు సంరక్షణ కేంద్రంలో శస్త్రచికిత్స చేసి మళ్లీ వార్డుల్లో వదిలి పెట్టారు. ఈ చర్యతో వీటి సంతతి తగ్గుతుందని పురపాలిక అధికారులు భావించారు.

నిధులకు ఎసరు..



కేవలం కుక్కల కుటుంబ నియంత్రణకు సాధారణ నిధులు రూ.70 లక్షలు వ్యయం చేయడంపై పలువురు పాలకవర్గ సభ్యులు వ్యతిరేకిస్తున్నారు. పట్టణంలో పలు దీర్ఘకాలిక సమస్యలెన్నో ఉన్నప్పటికీ కేవలం కుక్కల కు.ని. కోసం భారీ మొత్తాన్ని ఖర్చు చేయడం వెనుక కొందరు అధికారులు, ఇతర ప్రజాప్రతినిధుల ప్రమేయం ఉందనే ప్రచారం జరుగుతోంది. స్పష్టత లేని లెక్కలు వేసి నిధులను పక్కదారి పట్టించేందుకు అవకాశం లేకపోలేదని చెబుతున్నారు. జిల్లాస్థాయి ఉన్నతాధికారులు దీనిపై విచారణ చేపడితే వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

బిల్లు మంజూరు సమయంలో పరిశీలిస్తాం

కుక్కల నియంత్రణకు రూ.70 లక్షల బిల్లు ఆమోదం పొందినా ఇప్పటి వరకు చెల్లింపులు జరగలేదు. పట్టణంలో మొత్తం 1,000 కుక్కలను మాత్రమే పట్టుకున్నారు. ఇంకా పట్టాల్సినవి ఉన్నాయి. బిల్లు చెల్లింపు సమయంలో లెక్కలు పరిశీలించిన తరువాతే మంజూరు చేస్తాం.చిరం జీవి, కమిషనర్

5 వేల శస్త్రచికిత్సలు చేశారట!

పురపాలక అధికారులు స్వల్ప సమయంలోనే 5 వేల కుక్కలకు శస్త్రచికిత్సలు చేశామని.. ఒక్కో కుక్కకు రూ.1,400 చొప్పున మొత్తం రూ.70 లక్షల నిధుల మంజూరుకు గత సెప్టెంబరులో సభ్యుల ఆమోదం పొందారు. దీనిపై సమావేశంలో సభ్యులు అడిగినా ఏ అధికారి కూడా స్పష్టమైన సమాధానం ఇవ్వకపోవడం గమనార్హం. వాస్తవంగా 5 వేల కుక్కలకు కు.ని. చేపడితే తాజాగా పలు కాలనీల్లో కుక్కల సంతానం ఎందుకు కనబడుతుందనే విమర్శలు వినిపిస్తున్నాయి. మరోవైపు మగ కుక్కలకు మాత్రమే కు.ని.చేపట్టే అవకాశం ఉందని ఈ లెక్కన వాటి సంఖ్య 5 వేలు ఉంటే ఆడకుక్కల సంఖ్య మాటేమిటనే సందేహాలు ఉత్పన్నమవుతున్నాయి. మరోవైపు 48 వార్డుల్లో కలిపి 2 వేల కుక్కలు కూడా ఉండే అవకాశం లేదని పలువురు వార్డు కౌన్సిలర్లు చెబుతున్నారు.

## కార్మికుల కోటా.. ఖాళీలే ఏటా!

ఇంజినీరింగ్ విద్యపై యువతలో క్రేజ్ తగ్గకున్నా కొన్ని బ్రాంచులకే ఆదరణ కనిపిస్తోంది.. కంప్యూటరు సైన్స్‌తో పాటు ఏఐ కోర్సుల్లో చేరడానికి ఆసక్తి చూపుతుండగా, సివిల్, మెకానికల్ వంటి కోర్సుల్లో చేరేవారి సంఖ్య క్రమంగా తగ్గుతోంది.. సింగరేణిలో ఉద్యోగాలకు కీలకమైన మైనింగ్ కోర్సుదీ అదే పరిస్థితి.. మంథని జేఎన్టీయూ కళాశాలలో సంస్థ ఉద్యోగుల పిల్లలకు ప్రత్యేకంగా కేటాయిస్తున్న సీట్లు పూర్తి స్థాయిలో భర్తీ కావడం లేదు.

సెంటినరీకాలనీలోని మంథని జేఎన్టీయూ ఇంజినీరింగ్ కళాశాలలో సూపర్ న్యూమరరీ సీట్లు పూర్తి స్థాయిలో భర్తీ కావడం లేదు. ఈఏపీసెట్‌లో ఉత్తీర్ణత ఆధారంగా సింగరేణి కార్మికులు, ఉద్యోగుల పిల్లలకు కళాశాలలో 10 శాతం సీట్లు కేటాయిస్తున్నారు. ఆరు బ్రాంచుల్లో ఉద్యోగుల పిల్లలకు 18, కార్మికుల పిల్లలకు 18 చొప్పున సీట్లు కేటాయిస్తుండగా ప్రవేశాలు పొందే విద్యార్థుల సంఖ్య ఏటికేడు తగ్గుతోంది.

అందుబాటులో ఆరు బ్రాంచులు

కళాశాలలో సివిల్, ఎలక్ట్రికల్–ఎలక్ట్రానిక్స్, మెకానికల్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్, మైనింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజన్స్ అండ్ మిషన్ లెర్నింగ్ బ్రాంచులు అందుబాటులో ఉన్నాయి. సింగరేణి అధికారులు, కార్మికుల పిల్లలకు కలిపి 36 సీట్లు కేటాయిస్తున్నారు.

రెండేళ్లలో ఒక్కరూ చేరలే!

జేఎన్టీయూ 2010లో సెంటినరీకాలనీలో ఇంజినీరింగ్ కళాశాలను ఏర్పాటు చేసింది. భవన నిర్మాణానికి సింగరేణి సంస్థ కొన్ని నిధులు కేటాయించింది. సివిల్, ఎలక్ట్రికల్–ఎలక్ట్రానిక్స్, మైనింగ్, మెకానికల్ కోర్సులు అందుబాటులో ఉండగా ప్రారంభంలో సూపర్ న్యూమరరీ కోటా కింద అయిదు శాతం సీట్లు సింగరేణికి కేటాయించారు. 2022–23 నుంచి 10 శాతానికి పెంచారు. ఆరు బ్రాంచులో 36 సీట్లు కేటాయించగా 2022–23లో 26, 2023–24లో 24, 2024–25లో 24 సీట్లు మిగిలిపోయాయి. సివిల్, ఎలక్ట్రికల్ ఎలక్ట్రానిక్స్, మెకానికల్, మైనింగ్ కోర్సుల్లో గత రెండేళ్లలో ఒక్కరూ చేరలేదు.

మిగులు సీట్ల మాటేమిటి?సింగరేణి కార్మికులు, అధికారుల పిల్లల కోసం కేటాయిస్తున్న సీట్లు ఏటా మిగిలిపోతున్నా, నిబంధనల ప్రకారం ఇతరులతో భర్తీ చేయడానికి వీల్లేదు. ప్రభావిత గ్రామాలు, కాంట్రాక్టు కార్మికుల పిల్లలతో నింపాలన్న వాదన వినిపిస్తోంది. గత మూడేళ్లలో 108 సీట్లకు 74 సీట్లు మిగిలినా ప్రత్యామ్నాయ ఆలోచనలు చేయడం లేదు. అర్హత ఉన్న విద్యార్థులకు మిగులు సీట్లు కేటాయించడం ద్వారా వారి భవిష్యత్తుకు బాటలు పడే అవకాశం ఉంది. సింగరేణి కార్పొరేట్ విభాగం అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవాలన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఎందుకిలా..సింగరేణి సంస్థలో సివిల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, మెకానికల్, మైనింగ్ కోర్సులు ప్రధానమైనవి. సూపర్ న్యూమరరీ కోటా కింద గత మూడేళ్లలో ఈ కోర్సుల్లో ఉద్యోగుల పిల్లలు నలుగురు మాత్రమే ప్రవేశం తీసుకున్నారు.

సాఫ్ట్‌వేర్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగాల్లో ఉపాధి అవకాశాలు మెరుగ్గా ఉండటంతో ఎక్కువ మంది విద్యార్థులు సీఎస్ఐ, ఏఐ బ్రాంచులపై ఆసక్తి చూపుతున్నారు. గనుల్లో విధులు కష్టంతో కూడుకుని, ఎండలో పని చేయాల్సి ఉండటంతో ఈ కోర్సుల వైపు ఆసక్తి చూపడం లేదు. సంస్థ కార్మికులు, ఉద్యోగులకు పనితీరు తెలుసు గనక, తాము అనుభవించిన కష్టం పిల్లలు పడొద్దని ఇతర కోర్సుల్లో చేరుస్తున్నట్లు ఓ విద్యార్థి తండ్రి తెలిపారు. కంప్యూటర్ సైన్స్, ఏఐ కోర్సులకు డిమాండ్ ఉండటంతో వాటిలో చేరాలని పిల్లలపై కుటుంబ సభ్యులు ఒత్తిడి తెస్తున్నారు. సంస్థకు ప్రధానమైన ఈ కోర్సుల్లో విద్యార్థులు చేరకపోవడం ఆందోళన కలిగిస్తోందని సింగరేణి సంస్థకు చెందిన ఓ అధికారి పేర్కొన్నారు.




## కాంగ్రెస్ ఎంపీ సీటు వద్ద నోట్ల కట్ట.. రాజ్యసభలో ఆందోళన

దిల్లీ: రాజ్యసభలో కరెన్సీ నోట్ల కట్ట సంచలనం సృష్టించింది. కాంగ్రెస్‌కు చెందిన ఓ ఎంపీ సీటు వద్ద దీన్ని గుర్తించినట్లు ఛైర్మన్ జగ్‌దీప్ ధన్‌ఖడ్ శుక్రవారం సభలో ప్రకటించడం తీవ్ర దుమారానికి దారితీసింది. అధికార, విపక్ష సభ్యుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. దీనిపై సమగ్ర దర్యాప్తునకు ఆదేశించాలని భాజపా డిమాండ్ చేసింది. అసలేం జరిగిందంటే..? పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో భాగంగా రాజ్యసభ శుక్రవారం సమావేశమైంది. ఈసందర్భంగా ఛైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ మాట్లాడుతూ.. "గురువారం సభను వాయిదా వేసిన తర్వాత భద్రతా అధికారులు ఛాంబర్‌లో సాధారణ తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలోనే 222వ నంబరు సీటు వద్ద ఓ నోట్ల కట్టను గుర్తించారు. అది తెలంగాణ నుంచి ఎన్నికైన కాంగ్రెస్ ఎంపీ అభిషేక్ మను సింఘ్వీకి కేటాయించిన సీటు. ఈ విషయాన్ని నా దృష్టికి తీసుకురాగానే దర్యాప్తునకు ఆదేశించా" అని వెల్లడించారు. రూ.500, రూ.100 కరెన్సీ నోట్లు ఉన్న కట్టను గుర్తించినట్లు ధన్‌ఖడ్ తెలిపారు. ఆ నోట్లు అసలైనవో.. నకిలీవో స్పష్టత లేదన్నారు. ఈ విషయాన్ని సభకు చెప్పడం తన బాధ్యత అన్నారు. దీంతో ఇది కాస్తా వివాదానికి దారితీసింది. ఛైర్మన్ ప్రకటనను సభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే ఖండించారు. ఈ ఘటనపై విచారణకు ఎలాంటి అభ్యంతరం లేదని చెప్పిన ఆయన.. దర్యాప్తు పూర్తికాకముందే సభ్యుడి పేరు చెప్పడంపై అసంతృప్తి వ్యక్తంచేశారు. అయితే, ఖర్గే వ్యాఖ్యలను పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు తప్పుబట్టారు. "పేరు చెబితే తప్పేంటి? ఏ సీటు వద్ద నగదు దొరికిందో.. అక్కడ ఎవరు కూర్చుంటారో ఛైర్మన్ చెప్పారు. అందులో సమస్య ఏముంది? ఇలా నోట్ల కట్టలను సభకు తీసుకురావడం సరికాదు. దీనిపై సీరియస్‌గా దర్యాప్తు జరగాలి" అని అన్నారు. రాజ్యసభ సమగ్రతకు అవమానం కలిగించారని భాజపా జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా కాంగ్రెస్‌పై మండిపడ్డారు.

**స్పందించిన సింఘ్వీ..** మరోవైపు, ఈ పరిణామాలపై కాంగ్రెస్ ఎంపీ సింఘ్వీ స్పందించారు. తాను కేవలం ఒకేఒక్క రూ.500 నోటు తీసుకొచ్చానని తెలిపారు. "ఇలాంటి పరిస్థితిని నేనెన్నడూ చూడలేదు. నిన్న రాజ్యసభకు వచ్చేటప్పుడు నా జేబులో కేవలం ఒక రూ.500 నోటు మాత్రమే ఉంది. నిన్న మధ్యాహ్నం 12.57 గంటలకు సభ లోపలికి వచ్చా. ఒంటి గంటకు సభ వాయిదా పడటంతో క్యాంటీన్‌కు వెళ్లా. మధ్యాహ్నం 1.30 గంటలకు పార్లమెంట్ నుంచి వెళ్లిపోయా" అని సింఘ్వీ సోషల్ మీడియాలో రాసుకొచ్చారు.




గన్నవరం: ఎన్టీఆర్ జిల్లా గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ అనుచరులను పోలీసులు అరెస్ట్ చేశారు. వైకాపా హయాంలో గన్నవరం తెదేపా కార్యాలయంపై జరిగిన దాడి కేసులో నిందితులుగా ఉన్న 11 మందిని శుక్రవారం తెల్లవారుజామున అరెస్ట్ చేసి పీఎస్‌కు తరలించారు. వీరిలో వంశీ పీఏ రాజా కూడా ఉన్నారు. విజయవాడ గ్రామీణం, గన్నవరం, బాపులపాడు, ఉంగుటూరుకు చెందిన మరికొందరిని కూడా పోలీసులు అదుపులోకి తీసుకునే అవకాశముంది.

## పథకాల రద్దుతో దళితులకు జగన్ వెన్నుపోటు: మంత్రి నిమ్మల



విజయవాడ: గత ఐదేళ్లలో దళితుల సంక్షేమ పథకాలను మాజీ సీఎం జగన్ రద్దు చేసి వారికి వెన్నుపోటు పొడిచారని మంత్రి నిమ్మల రామానాయుడు విమర్శించారు. అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో ఆయన రక్తదానం చేశారు. అంతకుముందు ఆసుపత్రిని తనిఖీ చేసి రోగుల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. గత 18 ఏళ్లుగా అంబేడ్కర్ వర్ధంతి రోజు తమ తండ్రి పేరుతో ఉన్న ధర్మారావు ఫౌండేషన్ పేరిట రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. తాను రక్తదానం చేయడం ఇది 24వ సారి అని తెలిపారు. "గతంలో తెదేపా హయాంలో ఎస్సీ సబ్‌ప్లాన్‌ను సమర్థంగా అమలు చేస్తే.. వైకాపా పాలనలో ఆ నిధులను సైతం దారి మళ్లించారు. దళిత వ్యక్తిని వైకాపా ఎమ్మెల్సీ చంపి డోర్ డెలివరీ చేస్తే.. అతడిని సన్మానించిన ఘనుడు జగన్. పార్లమెంట్, అసెంబ్లీలో దళితులకు ఉన్నత పదవులు కట్టబెట్టిన ఘనత తెదేపాది. అంబేడ్కర్ స్ఫూర్తితో చంద్రబాబు పనిచేస్తున్నారు. జీఎంసీ బాలయోగిని లోక్‌సభ స్పీకర్‌గా, ప్రతిభా భారతికి శాసనసభ స్పీకర్ పదవి ఇచ్చాం. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సీఎస్‌గా దళిత బిడ్డ కాకి మాధవరావును నియమించారు. ఎస్సీ కమిషన్ ఏర్పాటు చేసి జస్టిస్ పున్నయ్యను దానికి ఛైర్మన్‌గా నియమించారు. రాష్ట్రంలో అంబేడ్కర్ ఆశయాలను అమలు చేస్తున్నాం" అని మంత్రి చెప్పారు.

## విశాఖ అభివృద్ధిపై సీఎం చంద్రబాబు కీలక నిర్ణయాలు

విశాఖపట్నం: డీప్ టెక్నాలజీ ద్వారా ప్రజలకు మరింత చేరువకు తీసుకువెళ్లేందుకు ప్రయత్నాలు చేస్తున్నామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు.. డీప్ టెక్నాలజీ పై ఈరోజు సదస్సులో చర్చించామని అన్నారు. సాంకేతికతను వినియోగించుకుని ఏపీని మరింత అభివృద్ధి చేయాలని ఆలోచిస్తున్నామని చెప్పారు. ఇవాళ(శుక్రవారం) విశాఖపట్నంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. సాంకేతికతను వినియోగించుకుని పరిపాలనకు మరింత సౌలభ్యం ఉంటుందని సూచించారు.. ఈచ్ వన్ ఎంటర్ ప్రెన్యూర్ వన్ అనే నినాదం ముందుకు వెళ్తున్నామని వివరించారు.. ఫోర్ పీసీ విధానంతో పాటుగా 4 ఈ విధానం కూడా అమలు చేస్తామన్నారు. అభివృద్ధికి టెక్నాలజీని జోడిస్తే, మంచి ఫలితాలు వస్తాయని ఉద్ఘాటించారు. విశాఖ అభివృద్ధి మీద విజన్ డాక్యుమెంట్ సిద్ధం చేస్తామని.. అన్ని విధాల విశాఖ అభివృద్ధి చేస్తామని తెలిపారు.



విశాఖపట్నం మెట్రోకు డీపీఆర్ తయారు చేసి పంపించామని చెప్పారు. రైల్వే జోన్ వస్తోంది. జోన్ భవనాల నిర్మాణ అంశాలు ప్రక్రియ ప్రారంభం అవుతుందని అన్నారు. స్టీల్ ప్లాంట్ కాపాడుకోవడానికి అన్ని విధాలా ప్రయత్నం చేస్తున్నామని చెప్పారు. విశాఖకు కూడా సీ ప్లైన్ అనుకూలతను పరిశీలిస్తున్నామని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.




## కోల్‌కతా, త్రిపురల నుంచి దౌత్యవేత్తలను వెనక్కి పిలిపించిన బంగ్లాదేశ్

భారత్‌లోని ఇద్దరు సీనియర్ దౌత్యవేత్తలు తక్షణమే తిరిగి రావాలని బంగ్లాదేశ్ ప్రభుత్వం ఇటీవల ఆదేశించింది. దీంతో ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతలు మరింత పెరిగినట్లైంది. కోల్‌కతాలోని డిప్యూటీ హైకమిషనర్ షిక్దార్ మహమ్మద్ అష్రఫుల్ రహ్మాన్, అగర్తలలోని అసిస్టెంట్ హైకమిషనర్ ఆరిఫ్ మహమ్మద్‌ను రీకాల్ చేస్తున్నట్లు బంగ్లా ప్రభుత్వం ప్రకటించింది. ఇస్కాన్‌కు చెందిన చిన్మయ్ కృష్ణదాస్‌ను అరెస్టు చేయడానికి నిరసనగా పశ్చిమబెంగాల్, త్రిపుర రాష్ట్రాల్లో బంగ్లాదేశ్ దౌత్య కార్యాలయాల వద్ద ఆందోళనలు జరిగాయి. ఈనేపథ్యంలో ఈ దౌత్యవేత్తలను వెనక్కి పిలిపించినట్లు తెలుస్తోంది. తదుపరి ఆదేశాలు వచ్చేవరకు వీరిద్దరూ ఢాకా నుంచి పనిచేయాలని సూచించినట్లు సమాచారం. ఈనేపథ్యంలో అష్రఫుల్ రహ్మాన్ నిన్ననే బంగ్లాదేశ్‌కు చేరుకొన్నట్లు తెలుస్తోంది. ఇక త్రిపురలోని ఆరిఫ్ రేపు స్వదేశానికి వెళ్లిపోనున్నారు. ఇటీవల త్రిపురలోని అగర్తలాలో ఉన్న బంగ్లాదేశ్ అసిస్టెంట్ హైకమిషన్ కార్యాలయం ముందు వందల మంది ప్రజలు ఆందోళనకు దిగారు. ఆ ఆఫీస్‌ను బంద్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కొందరు కార్యాలయంలోకి దూసుకెళ్లినట్లు తెలుస్తోంది. దీనిపై బంగ్లాదేశ్ విదేశాంగశాఖ స్పందిస్తూ.. ఉద్దేశపూర్వకంగానే ఆందోళనకారులను కార్యాలయంలోకి అనుమతించారని ఆరోపించింది. ఈసందర్భంగా బంగ్లాదేశ్ పతాకం, కొన్ని వస్తువులు ధ్వంసమైనట్లు పేర్కొంది. ఇస్కాన్‌కు చెందిన చిన్మయ్ కృష్ణదాస్‌కు మద్దతుగా త్రిపుర రాజధాని అగర్తలలో ఆందోళనకారులు సోమవారం బంగ్లా అసిస్టెంట్ హైకమిషన్ కార్యాలయాన్ని ముట్టడించిన విషయం తెలిసిందే. భద్రతా కారణాల దృష్ట్యా ఈ కార్యాలయంలో కాన్సులర్ సేవలను ప్రస్తుతానికి నిలిపేశారు. ఈనేపథ్యంలో బంగ్లాదేశ్‌లోని భారత్ హైకమిషనర్ ప్రణయ్ వర్మ.. అక్కడి విదేశాంగ ఉన్నతాధికారులతో భేటీ అయిన విషయం తెలిసిందే. మరోవైపు బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులపై భారత్ ఆందోళన వ్యక్తంచేసింది.




## వైసీపీ నేతల్లో ఉలిక్కిపాటు.. నిజాలు బయటకు వస్తాయని భయపడుతున్నారా

వైసీపీ నేతల్లో ఆందోళన ఎక్కువైందా.. గుమ్మడి కాయల దొంగ ఎవరంటే భుజాలు తడుముకుంటున్నారా.. నిజాలు బయటకు వస్తే రాజకీయ భవిష్యత్తు ఉండదని భయపడుతున్నారా.. ప్రస్తుతం వైసీపీ నేతల తీరు చూస్తుంటే ఇవే అనుమానాలు కలుగుతున్నాయట. 2019-2024 మధ్య కాలంలో వైసీపీ ప్రభుత్వ పాలనపై అప్పటి ప్రతిపక్షం టీడీపీ ఎన్నోసార్లు హెచ్చరిస్తూనే వచ్చింది. అరాచక పాలనకు చరమగీతం పాడాలని, ప్రజా పాలన అందించకపోతే.. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తప్పులకు శిక్ష అనుభవించాల్సి వస్తుందని ఐదేళ్ల క్రితం నుంచి హెచ్చరిస్తూ వచ్చినా.. అప్పటి పాలకులు పట్టించుకోలేదు. శాశ్వతంగా అధికారం తమదే.. ఎట్టి పరిస్థితుల్లో మరో పది నుంచి పదిహేనేళ్లు వేరే పార్టీకి అవకాశం లేదనే భ్రమల్లో వైసీపీ నేతలు ఉంటూ వచ్చారనే ప్రచారం జరిగింది.

ప్రతిపక్షాల హెచ్చరికలను పట్టించుకోకపోగా.. తమ ఇష్టారాజ్యంగా ప్రభుత్వాన్ని నడపడమే కాకుండా.. అధికారులతో నిబంధనలకు వ్యతిరేకంగా తప్పుడు పనులను గత వైసీపీ ప్రభుత్వం చేయించిందనే చర్చ రాష్ట్రంలో జరిగింది. దాని ఫలితంగానే ప్రస్తుతం ఎంతోమంది అధికారులు విచారణను ఎదుర్కోవల్సిన పరిస్థితి ఏర్పడిందనే చర్చ సాగుతోంది. చివరకు ఐదేళ్ల తర్వాత ప్రజలు ఓటు ద్వారా తమ నిర్ణయాన్ని వెల్లడించారు. వైసీపీ ప్రభుత్వంపై తాము అసంతృప్తిగా ఉన్నామని తీర్పునిచ్చారు. దీంతో వైసీపీ ప్రభుత్వం అధికారాన్ని కోల్పోయి టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం ఏర్పడింది. ఐదేళ్ల పాటు అధికారంలో ఉండి ఇష్టారాజ్యంగా వ్యవహరించిన వైసీపీ నేతలకు 2024 జూన్‌లో జ్ఞానోదయం అయింది. దీంతో తమ తప్పులపై విచారణ జరిగితే ఐదేళ్ల అరాచకాలు ప్రజలకు తెలిసిపోతాయనే భయంతోనే కూటమి ప్రభుత్వంపై వైసీపీ అసత్య ప్రచారం చేయడంతో పాటు ప్రతి విషయానికి ఉలిక్కి పడుతోందని కూటమి నేతలు ఆరోపిస్తున్నారు.

**కాకినాడ పోర్టు విషయంలో..** కాకినాడ పోర్టు కాంట్రాక్టును అతి తక్కువ ధరకు ఓ సంస్థ దక్కించుకుందని, అధికారంలో ఉన్నప్పుడు ప్రభుత్వ పెద్దలు తనను బెదిరించారని ఓ వ్యక్తి ఫిర్యాదుతో సీఐడీ కేసు దర్యాప్తు ప్రారంభించింది. విచారణ ప్రాథమిక దశలో ఉండగానే వైసీపీలో కొందరు ముఖ్యనేతలు బయటకువచ్చి తమకు ఏ పాపం తెలియదని, నిబంధనల ప్రకారమే నడుచుకున్నామని చెబుతున్నారు. ఒకవేళ నిబంధనల ప్రకారం నాయకులు నడుచుకుని ఉంటే ఉలిక్కిపాటు ఎందుకు.. విచారణలో వాస్తవాలు నిగ్గుతేలతాయి కదా.. కానీ విచారణలో వైసీపీ నేతల అక్రమాలు, అరాచకాలు బయటపడకుండా ఉండేందుకే వైసీపీ నేతలు ముందుగానే విచారణపై తప్పుడు ప్రచారం చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

గత వైసీపీ ప్రభుత్వంలో తప్పుడు కేసులు బనాయించి, ప్రత్యర్థి పార్టీలపై కక్ష తీర్చుకున్న విధంగా ప్రస్తుత ప్రభుత్వం పనిచేస్తుందనే భ్రమల్లో వైసీపీ నేతలు ఉండి ఉంటారని, ఆ భ్రమలు తొలగించుకోవాలని కూటమి నేతలు హితవు పలుకుతున్నారు.




## ఖర్గే మాటలు.. మోదీ నవ్వులు: పార్లమెంట్ ఆవరణలో అరుదైన దృశ్యం

దిల్లీ: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా పార్లమెంటు ఆవరణలో మహాపరినిర్వాణ్ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రధాని నరేంద్ర మోదీ అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం అక్కడ ఓ ఆసక్తికర సన్నివేశం చోటుచేసుకుంది. ప్రధాని మోదీ, కాంగ్రెస్ జాతీయాధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పరస్పరం పలకరించుకొని కాసేపు నవ్వుతూ మాట్లాడుకున్నారు. దీనికి సంబంధించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతున్నాయి. ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, మల్లికార్జున ఖర్గే తదితరులు హాజరై నివాళులర్పించారు. ఈసందర్భంగా ఖర్గే మోదీ వద్దకు వచ్చి షేక్‌హ్యాండ్ ఇచ్చారు. అనంతరం ఇరువురు నేతలు కాసేపు నవ్వుతూ ముచ్చటించారు. ఎప్పుడూ పరస్పర విమర్శలు చేసుకొనే నేతలు ఒకేచోట నవ్వులు పూయిస్తూ మాట్లాడుకుంటున్న దృశ్యాలు వైరల్‌గా మారాయి. మరోవైపు లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అంబేడ్కర్‌కు నివాళులర్పించారు. 'సమానత్వం, మానవ గౌరవం కోసం డా.బీఆర్ అంబేడ్కర్ చేసిన అవిశ్రాంత పోరాటం తరతరాలకు స్ఫూర్తినిస్తూనే ఉంటుంది. ఈరోజు ఆయన సహకారాన్ని గుర్తుచేసుకుంటూ, ఆయన సంకల్పాన్ని నెరవేర్చేందుకు మా నిబద్ధతను పునరుద్ఘాటిస్తున్నాం' అని మోదీ ఎక్స్‌లో పేర్కొన్నారు.

## ప్రతిష్ఠాత్మకంగా రెవెన్యూ సదస్సులు: ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

కృష్ణా: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎంతో ప్రతిష్ఠాత్మకంగా రెవెన్యూ సదస్సులు చేపడుతున్నారని గుడివాడ ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు తెలిపారు. బాపులపాడు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఇవాళ(శుక్రవారం) రెవెన్యూ సదస్సు జరిగింది. మాజీ ముఖ్యమంత్రి జగన్ రెడ్డిపై యార్లగడ్డ వెంకట్రావు కౌంటర్లు వేశారు. ఈ సదస్సులో యార్లగడ్డ వెంకట్రావు పాల్గొని మాట్లాడుతూ... మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ రాజ్యాంగం ప్రకారం ఆస్తి హక్కులో మహిళలకు 50శాతం కల్పించారని యార్లగడ్డ వెంకట్రావు గుర్తుచేశారు. ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలకు ఇవ్వాల్సిన ఆస్తిని జగన్ ఇవ్వాలని అన్నారు. జగన్ ప్రభుత్వం చేసిన తప్పుల వల్ల ఇప్పుడు రెవెన్యూ సదస్సులు నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. ఇప్పుడు గుంటలు పూడ్చే పరిస్థితి తమ ప్రభుత్వానికి వచ్చిందని అన్నారు. రాష్ట్ర మొత్తం మీద గన్నవరం నియోజకవర్గంలో రెవెన్యూ రికార్డులు ఎక్కవగా తారుమారు చేశారని అన్నారు. గత10 సంవత్సరాల నుంచి ఇక్కడ పని చేసిన ఎమ్మార్వోలు తప్పులు చేస్తే ఎవరిని వదిలే ప్రసక్తి లేదని యార్లగడ్డ వెంకట్రావు హెచ్చరించారు.

## గత ప్రభుత్వ చర్యల వల్లే ఈ స్థితి.. మంత్రి ఆగ్రహం



కర్నూలు, డిసెంబర్ 6: స్థానిక నంద్యాల చెక్ పోస్ట్‌లోని రోడ్ల ప్యాచ్ వర్క్‌లను, ఎన్‌హెచ్ పనులను రాష్ట్ర రోడ్లు, భవనాలు, పెట్టుబడులు, మౌలిక వసతులు శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. నంద్యాల చెక్ పోస్ట్ నుంచి గార్గేయపురం వరకూ రోడ్డు పనులు పరిశీలించినట్లు తెలిపారు. కేజీ రహదారి విస్తరణ.. నగరంలోని రోడ్లు వెడల్పుకు డీపీఆర్ తయారు చేయమని అధికారులను ఆదేశించానన్నారు. రోడ్లపై ట్రాన్స్ ఫార్మర్స్ ఉండటం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని.. వాటిని తొలగించాలని ఆదేశాలు ఇచ్చామన్నారు. ఆదోనిలో గుంతల పూడ్చివేత 40 శాతం మాత్రమే జరిగిందని.. పనులు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. సంక్రాంతి లోపల రాష్ట్ర వ్యాప్తంగా గుంతలను పూడ్చి వేస్తామని స్పష్టం చేశారు. గత ప్రభుత్వం రోడ్ల పనులకు రెన్యూవల్ చేయలేదని.. దీంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారన్నారు. అలాగే టూరిజంకు భారీ నష్టం వాటిల్లిందని అన్నారు. అమరావతిలో భారీ బడ్జెట్‌తో రహదారుల నిర్మాణం జరుగుతోందన్నారు. ఇతర రాష్ట్రాల్లో రోడ్లపై అధ్యయనం చేశామని.. త్వరలోనే పీపీ మాడల్‌లో రోడ్ల నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు.

# చీరలో అప్సరస మెరుపులు

'పుష్ప 2' కిస్సిక్ సాంగ్ తో శ్రీలీల ఊహించని సర్ ప్రైజ్ ఇచ్చిన విషయం తెలిసిందే. సౌత్ ఇండియాలో క్రేజియస్ట్ హీరోయిన్ గా ఉన్న ఈ అమ్మడు ప్రస్తుతం డాన్సింగ్ క్వీన్ అనే ఇమేజ్ తో దూసుకుపోతోంది. కమర్షియల్ హీరోయిన్ గా ఓ వైపు స్టార్ హీరోలతో జతకడుతూ మరో వైపు పాన్ ఇండియా స్టార్స్ తో కూడా ఆడిపాడే అవకాశాలు అందుకునే దిశగా అడుగులు వేస్తోంది. 'పెళ్లి సందD' సినిమాతో టాలీవుడ్ లోకి అడుగుపెట్టిన ఆ బ్యూటీ 'ధమాకా'లో రవితేజకి జోడీగా నటించి సూపర్ హిట్ అందుకుంది. ఈ ఏడాది ఆరంభంలో వచ్చిన 'గుంటూరు కారం'లో సూపర్ స్టార్ మహేష్ బాబుతో ఆడిపాడింది. ఈ సినిమాలోని కుర్చీ మడతపెట్టి సాంగ్ తో డాన్సింగ్ క్వీన్ అనే ఇమేజ్ తెచ్చేసుకుంది. ఇదిలా ఉంటే 'పుష్ప 2'లోని కిస్సిక్ సాంగ్ తో ఈ బ్యూటీకి విపరీతమైన క్రేజ్ వచ్చేసింది.



ఈ సాంగ్ లో అల్లు అర్జున్ తో కలిసి అదిరిపోయే డాన్స్ మూమెంట్స్ చేసినట్లు తెలుస్తోంది. శ్రీలీల డాన్స్ పెర్ఫార్మెన్స్ ని తెరపై చూడటానికి ఆమె ఫ్యాన్స్ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ మూవీ హిట్ అయితే కచ్చితంగా శ్రీలీల క్రేజ్ పెరిగిపోవడం గ్యారెంటీ అనుకుంటున్నారు. ఈ నెలలో శ్రీలీల హీరోయిన్ గా నటించిన 'రాబిన్ హుడ్' మూవీ కూడా రిలీజ్ కి సిద్ధం అవుతోంది. నితిన్ హీరోగా వెంకి కుడుముల దర్శకత్వంలో కమర్షియల్ ఎంటర్టైనర్ గా ఈ సినిమా తెరకెక్కింది. ఇదిలా ఉంటే శ్రీలీల ఈ మధ్య ఇన్ స్టాగ్రామ్ లో యాక్టివ్ గా ఉంటుంది. రెగ్యులర్ గా గ్లామర్ ఫోటోలని షేర్ చేస్తోంది. తాజాగా ఇన్ స్టాలో ఆమె వైట్ కలర్ చీరలో ఉన్న స్టైలిష్ గ్లామర్ పిక్స్ పోస్ట్ చేసింది. ఈ ఫోటోలు ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి.

ఈ తెల్లచీరలో శ్రీలీల దివి నుంచి దిగివచ్చిన అప్సరసల ఉందనే కామెంట్స్ వస్తున్నాయి. ఆమె అందానికి ఎవరైనా ఫిదా అయిపోవాల్సిందే అని ప్రశంసిస్తున్నారు.

# ప్రియా వారియర్ ఇదో సర్ ప్రైజ్ మురిపం!

స్విమ్మింగ్ పూల్ లో జలకాలట కోసం... లేక్ లో..బీచ్ లో ఈత కోసం హీరోయిన్లు అంతా స్విమ్ షూట్లు వేస్తారు. టూపీస్ లు ధరిస్తారు. రకరకాల బికినీలు వేసుకుంటారు. వాటిలో అందాలు ఆరబోస్తు కెమెరాకి రకరకాల భంగిమల్లో ఫోజు లిస్తుంటారు. వాటిని అంతర్జాలంలోకి వదిలి నెటి జనుల్ని ఖుషీ చేస్తుంటారు. ఇదందా ఓ పద్ధతిగా పోతుంది. కానీ ఇలాంటి జలకాలాట కోసం మ్యాప్ వేసుకుని..అందంగా ముస్తాబై..పట్టు లంగావోణీ లు లాంటివి ఎవరైనా ధరించి చూసారా? అంటే ఇదొక్కడి చోద్యం అంటారు. కానీ ఓవర్ నైట్ స్టార్ ప్రియా ప్రకాష్ వారియర్ అలా భిన్నంగా ట్రై చేసి సక్సెస్ అయింది. ఇదిగో ఇక్కడిలా స్విమ్మింగ్ పూల్ లో అమ్మడి పోటో సెషన్



చూస్తే స్టన్ అవ్వాల్సిందే. రెండు చేతులకు మల్లె పూలు ధరించింది. ఎంతో అందంగా హెయిర్ స్టైల్ చేసుకుంది. మ్యాకప్ వేసుకుంది. నుదిటిన రూపాయి బిళ్లంగా బొట్టు పెట్టుకుంది. పట్టు పరికిణీ ధరించింది. టాప్ లో మ్యాచింగ్ బ్లౌజ్ ధరించింది. ఇదే దుస్తుల్లో ఈత కొలనులోకి దిగి వివిధ భంగిమల్లో ఫోజులిచ్చింది. ప్రియాని అలా చూసి అంతా స్టన్ అవుతున్నారు. రెగ్యులర్ స్విమ్ షూట్లకు భిన్నంగా ఇలా ట్రై చేసింది. యూనిక్ గానూ హైలైట్ అవుతుంది. ప్రస్తుతం ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. ప్రియా స్కిన్ షోకి యువత ఫిదా అవుతుంది. ప్రియాపై ఫోజులుపై ఎవరి స్టైల్లో వారు కామెంట్లు గుప్పిస్తున్నారు. ఇక అమ్మడి కెరీర్ గురించి చెప్పాల్సిన పనిలేదు. ఇండస్ట్రీకి మెరుపులా వచ్చింది. స్టార్స్ తో అవకాశాలు అందుకుంది. అయితే సక్సెస్ లు సరైనవి పడలేదు. లేదంటే? అమ్మడి కెరీర్ మరోలా ఉండేది. ప్రస్తుతం అవకాశాలు చేతిలో బాగానే ఉన్నాయి. హిందీ, కన్నడలోనే సినిమాలు చేస్తోంది. తెలుగు, తమిళ్ లో మాత్రం కొత్త అవకాశాలు రాలేదు.




# 'డాకు మహారాజ్' అప్డేట్.. నటసింహం మాస్ తుఫాన్!




గాడ్ ఆఫ్ మాసెస్ నందమూరి బాలకృష్ణ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం "డాకు మహారాజ్". బాబీ కొల్లి దర్శకత్వంలో ఈ భారీ మాస్ యాక్షన్ మూవీ తెరకెక్కుతోంది. నందమూరి అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ సినిమా షూటింగ్ కు సంబంధించిన ఓ క్రేజీ అప్డేట్ వచ్చింది. ఈ మూవీ షూటింగ్ పార్ట్ మొత్తం పూర్తయినట్లుగా మేకర్స్ తాజాగా సోషల్ మీడియా వేదికగా ప్రకటించారు. "డాకు మహారాజ్ మూవీ షూటింగ్ పూర్తయింది. ఈ సంక్రాంతికి బిగ్ స్క్రీన్‌లలో మాస్ తుఫాను కోసం మేమంతా సిద్ధంగా ఉన్నాము. అల్టిమేట్ పవర్ ప్యాక్డ్ మాస్ విస్ఫోటనం కోసం సిద్ధంగా ఉండండి" అని మేకర్స్ ట్విట్టర్ ఎక్స్ లో పోస్ట్ పెట్టారు. ఈ సందర్భంగా 'డాకూ ఇన్ యాక్షన్' అంటూ సరికొత్త పోస్టర్ ను అభిమానులతో పంచుకున్నారు. ఇందులో దర్శకుడు బాబీ సెట్స్ లో బాలయ్యకు సన్నివేశాన్ని వివరిస్తూ కనిపించారు. సెటప్ చూస్తుంటే ఇది సినిమాలో హాస్పిటల్ లో జరిగే సీన్ అని అర్థమవుతోంది. 'అఖండ', 'వీర సింహా రెడ్డి', 'భగవంత్ కేసరి' వంటి హ్యాట్రిక్ విజయాలతో దూసుకుపోతున్న నటసింహం బాలకృష్ణ... 'వాల్తేరు వీరయ్య' వంటి బ్లాక్ బస్టర్ హిట్టు కొట్టిన డైరెక్టర్ బాబీ కొల్లి కలిసి చేస్తున్న సినిమా కావడంతో "డాకు మహారాజ్" పై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ లుక్, టైటిల్ టీజర్ కు ఆడియన్స్ నుంచి మంచి రెస్పాన్స్ వచ్చింది. షూటింగ్ కూడా కంప్లీట్ అయ్యింది కాబట్టి, లేట్ చేయకుండా బ్యాక్ టూ బ్యాక్ ఏదొక ప్రమోషనల్ కంటెంట్ వదలాలని ఫ్యాన్స్ కోరుకుంటున్నారు. 'డాకు మహారాజ్' సినిమాలో బాలకృష్ణ మునుపెన్నడూ చూడని సరికొత్త లుక్ లో కనిపించారు. టీజర్ లో "ఈ కథ రాజ్యం లేకుండా యుద్ధం చేసిన ఒక రాజుది, గండ్ర గొడ్డలి పట్టిన యమధర్మ రాజుది, మరణాన్ని వణికించిన మహారాజుది" అంటూ బాలయ్య పాత్రను పరిచయం చేశారు. ఇందులో ప్రగ్యా జైస్వాల్, శ్రద్ధా శ్రీనాథ్, ఊర్వశి రౌతేలా హీరోయిన్లుగా నటిస్తున్నారు. బాలీవుడ్ స్టార్ యాక్టర్ బాబీ డియోల్, చాందినీ చౌదరి, రిషి కీలక పాత్రలు పోషిస్తున్నారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్‌ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య భారీ బడ్జెట్ తో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఎస్.థమన్ సంగీతం సమకూర్చారు. 'జైలర్' ఫేమ్ విజయ్ కార్తీక్ కన్నన్ సినిమాటోగ్రఫీ నిర్వహిస్తున్నారు. అవినాష్ కొల్లా ఆర్ట్ డైరెక్టర్ గా, నిరంజన్ దేవరమానే ఎడిటర్ గా వ్యవహరిస్తున్నారు. 'డాకు మహారాజ్' చిత్రాన్ని సంక్రాంతి కానుకగా 2025 జనవరి 12న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నారు. సంక్రాంతికి 'డాకు మహారాజ్' సినిమాతో పాటుగా 'గేమ్ చేంజర్' 'సంక్రాంతికి వస్తున్నాం' చిత్రాలు కూడా రిలీజ్ అవుతున్నాయి. మిగతా రెండు సినిమాల ప్రమోషన్స్ స్పీడ్ అందుకుంటున్నాయి కానీ, ఆ విషయంలో బాలయ్య మూవీ కాస్త వెనకబడి పోయింది. వీలైనంత త్వరగా ఫస్ట్ సింగిల్ అప్డేట్ ఇచ్చి, మ్యూజికల్ ప్రమోషన్స్ స్టార్ట్ చెయ్యాలని అభిమానులు ఆశిస్తున్నారు. మరి నిర్మాత నాగ వంశీ ఎలాంటి అప్డేట్ తో వస్తాడో చూడాలి.

# ఎట్టకేలకు 'గేమ్ ఛేంజర్' బిగ్ అప్‌డేట్




గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ – ప్రముఖ దర్శకుడు శంకర్ షణ్ముగం 'గేమ్ ఛేంజర్' కోసం జతకట్టారు. ఇది పొలిటికల్ డ్రామా. దిల్ రాజు– శిరీష్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. సంక్రాంతి కానుకగా 10 జనవరి 2025న బహు భాషల్లో ఈ చిత్రం గ్రాండ్ రిలీజ్ కాబోతోంది. కియారా అద్వానీ కథానాయికగా నటించిన ఈ చిత్రంలో భారీ తారాగణం నటించారు. తాజాగా కానుక కోసం వేచి చూస్తున్న మెగా ఫ్యాన్స్ కి అద్భుతమైన వార్తను అందించింది శంకర్ టీమ్. గేమ్ ఛేంజర్ టీజర్ నవంబర్ 9న విడుదల కానుందని ప్రకటించారు. ఈ సినిమా నుంచి మాస్ పోస్టర్ ని రిలీజ్ చేసి టీజర్ డేట్ ని దానిలో రివీల్ చేసారు. రైల్వే ట్రాక్ పై ఆరుగురిని పడుకోబెట్టి ఒక చెక్కపై కూచుని చరణ్ తీక్షణంగా వారి వైపు చూస్తున్నాడు. అతడు గళ్ల పంచె, బనియన్ ధరించి మాసీగా కనిపిస్తున్నాడు. రైలు వచ్చే ముందు ఆ ఆరుగురి పరిస్థితిని ఊహించవచ్చు. ఈ సన్నివేశంతోనే అతడు గూస్ బంప్స్ తెప్పించడం ఖాయంగా కనిపిస్తోంది. అయితే టీజర్ లో దీనిని చూపిస్తారా లేదా? సందర్భం ఏమిటన్నది వేచి చూడాలి. ఐఏఎస్ టర్న్ డ్ ముఖ్యమంత్రిగా రామ్ చరణ్ ఈ చిత్రంలో నటిస్తున్నాడని ఇప్పటికే కథనాలొచ్చాయి. ఇందులో %ాజీ% సూర్య ప్రధాన విలన్ గా నటిస్తున్నారు. శ్రీకాంత్, అంజలి, సముద్రఖని, నవీన్ చంద్ర కీలక పాత్రధారులు. థమన్ ఈ ప్రాజెక్ట్‌కి సంగీతం అందించారు. సంక్రాంతి పందెంలో క్రేజ్ ఉన్న చిత్రంగా వస్తోంది. చరణ్ పాన్ ఇండియా ఆశలు ఫలిస్తాయా లేదా? ఆర్.ఆర్.ఆర్ తర్వాత శంకర్ ని ఎంపిక చేయడం అనే అతడి ఎత్తుగడ సరైనదేనా కాదా? అన్నదానికి కాలమే సమాధానం చెప్పాలి.

# త్రిధా చౌధరీ.. స్టన్నింగ్ లుక్ తో కిర్రాక్ పోజ్!

త్రిధా చౌధరీ.. ఈ బ్యూటీ ఎవరా అని ఆలోచిస్తున్నారా? యంగ్ హీరో నిఖిల్ సిద్ధార్థ్ సూర్య వర్సెస్ సూర్య మూవీతో టాలీవుడ్ సినీ ప్రియులకు పరిచయమయ్యారు ఈ బెంగాలీ ముద్దుగుమ్మ. ఆ సినిమా మోస్తరు విజయం సాధించినప్పటికీ తన అందం, అభినయంతో అందరినీ అలరించింది. ఆ తర్వాత మరో రెండు తెలుగు సినిమాల్లో నటించినా సరైన హిట్ కొట్టలేకపోయింది. పదేళ్ల క్రితం బెంగాలీ మూవీతో తన యాక్టింగ్ కెరీర్ స్టార్ట్ చేసిన త్రిధా.. అక్కడి చిత్రాల్లో అడపాదడపా కనిపిస్తున్నారు. సినీ ఇండస్ట్రీలోకి వచ్చిన రెండేళ్ల తర్వాత తెలుగు ఆడియన్స్ కు పలకరించిన అమ్మడు.. ఆ తర్వాత చిన్న గ్యాప్ లో సందీప్ కిషన్ గా మంజుల తెరకెక్కించిన మనసుకు నచ్చింది చిత్రంలో యాక్ట్ చేశారు. కానీ సక్సెస్ ను అందుకోలేకపోయారు. ఆ తర్వాత 7, అనుకున్నది ఒక్కటి అయినది ఒక్కటి చిత్రాల్లో అవకాశాలు దక్కించుకున్నారు. రెండు సినిమాల్లోనూ తన యాక్టింగ్ తో మెప్పించినా.. కావాల్సిన హిట్స్ ను సొంతం చేసుకోలేకపోయింది. గత నాలుగేళ్లుగా ఒక్క తెలుగు సినిమాలో కూడా



నటించలేదు. కానీ సోషల్ మీడియా ద్వారా టాలీవుడ్ ఫ్యాన్స్ ను ఎప్పటికప్పుడు పలకరిస్తుంటారు త్రిధా. సోషల్ మీడియాలో తరచూ యాక్టివ్ గా ఉంటూ కొత్త కొత్త పిక్స్ పోస్ట్ చేస్తోంది. వేరే లెవెల్ లో అందాలు ఆరబోసి మైమరపిస్తుంటారు. వెకేషన్స్ కు వెళ్తూ అక్కడి పిక్చర్స్ ను పంచుకుంటూ ఉంటోంది. బికినీల్లో స్కిన్ షోతో ఫిదా చేస్తోంది. నెట్టింట ఎప్పటికప్పుడు సెగలు రేపుతుంటారు త్రిధా చౌధరీ. తాజాగా కొత్త పిక్ ను పోస్ట్ చేశారు త్రిధా. అందులో బ్లాక్ కలర్ ప్యాంట్, ఎల్లో కలర్ ఇన్నర్ వేసుకుని సెల్ఫీ తీసుకుని దర్శనమిచ్చింది. తన స్టన్నింగ్ అందాలతో మైండ్ బ్లాక్ చేసేసింది. సొగసుతో ఫిదా చేసిన త్రిధా.. తన నవ్వుతో ఆకట్టుకుంది. ప్రస్తుతం త్రిధా కొత్త పిక్ తెగ చక్కర్లు కొడుతోంది. స్టన్నింగ్ బాడీ అంటూ నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. గ్లామరస్ క్వీన్ అంటూ కొనియాడుతున్నారు. సూపర్ ఫోటో అని చెబుతూ.. తెగ అట్రాక్ట్ అవుతున్నామని అంటున్నారు. క్యాప్షన్ కూడా క్రేజీగా ఉందని చెబుతున్నారు.

# మీనాక్షి చౌదరి.. ఎట్టకేలకు ఒక పెద్ద హిట్..

హీరోయిన్ మీనాక్షి చౌదరి.. ఈ హర్యానా బ్యూటీ యంగ్ హీరో సుశాంత్ ఇచ్చట వాహనములు నిలపరాదు మూవీతో టాలీవుడ్ లోకి ఎంట్రీ ఇచ్చిన విషయం తెలిసిందే. అవుట్ ఆఫ్ లవ్ వెబ్ సిరీస్ తో యాక్టింగ్ కెరీర్ స్టార్ట్ చేసిన బ్యూటీ.. అప్ స్టార్ట్స్ మూవీతో బాలీవుడ్ సినీ ఇండస్ట్రీలోకి అడుగు పెట్టారు. ఆ తర్వాత రెండేళ్ల గ్యాప్ లో తెలుగు సినీ ప్రియులకు హీరోయిన్ గా పరిచయమయ్యారు. తన అందం, అభినయంతో మెప్పించారు. ఆ తర్వాత మాస్ మహారాజా రవితేజతో నటించే ఛాన్స్ దక్కించుకున్నారు మీనాక్షీ చౌదరి. ఖిలాడీ సినిమాలో నటించి అందరినీ ఆకట్టుకున్నారు. అదే ఏడాది అడివి శేష్ తో హిట్– ది సెకండ్ కేస్ మూవీలో నటించి మెప్పించారు. తన కెరీర్ లో తొలి హిట్ ను సొంతం చేసుకున్నారు. ఆ తర్వాత కొలై సినిమాతో కోలీవుడ్ లోకి ఎంట్రీ ఇచ్చారు. 2024 ఏడాది సంక్రాంతికి గుంటూరు కారం మూవీతో ప్రేక్షకుల ముందుకు వచ్చారు. త్రివిక్రమ్ డైరెక్షన్ లో తెరకెక్కిన గుంటూరు కారంలో సెకండ్ హీరోయిన్ గా నటించారు. పెద్దగా స్కోప్ లేని రోల్ లో కనిపించినా.. తన యాక్టింగ్



తో మెప్పించారు. రీసెంట్ గా విజయ్ దళపతి ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్ లో నటించారు. కానీ సాంగ్స్, మూడు సీన్స్ కే పరిమితమయ్యారు. ఇప్పుడు చేతి నిండా సినిమాలతో టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా మారిపోయారు. వరుస ప్రాజెక్టుల్లో మీనాక్షి నటిస్తున్నారు. దీపావళి కానుకగా లక్కీ భాస్కర్ చిత్రంతో ఇప్పుడు థియేటర్లలో సందడి చేస్తున్నారు. మాలీవుడ్ స్టార్ హీరో దుల్కర్ సల్మాన్ సరసన నటించారు. యంగ్ డైరెక్టర్ వెంకీ అట్లూరి దర్శకత్వం వహించిన ఆ మూవీ ప్రీమియర్స్ షోస్ నిన్ననే పడ్డాయి. సినిమా అదిరిపోయిందని అంతా రివ్యూస్ ఇస్తున్నారు. చాలా బాగుందని చెబుతున్నారు. మీనాక్షి యాక్టింగ్ సూపర్ అని కొనియాడుతున్నారు. అదే సమయంలో ఎట్టకేలకు మీనాక్షి చౌదరి మంచి హిట్ అందుకున్నారని నెటిజన్లు అంటున్నారు. వాస్తవానికి అది నిజమే.. హిట్–2 తర్వాత మీనాక్షి ఇప్పుడే సరైన హిట్ ను దక్కించుకున్నారు. అదే సమయంలో మాస్ కా దాస్ విశ్వక్ సేన్ తో ప్రస్తుతం మెకానిక్ రాకీ చిత్రంలో నటిస్తున్నారు. మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ సరసన పాన్ ఇండియా మూవీ మట్కాలో యాక్ట్ చేస్తున్నారు. వెంకటేష్, అనిల్ రావిపూడి ప్రాజెక్ట్ లో కనిపించనున్నారు. మెగాస్టార్ చిరంజీవి విశ్వంభరలో నటిస్తున్నట్లు వార్తలు వచ్చినా.. అది నిజం కాదని రీసెంట్ గా మీనాక్షి క్లారిటీ ఇచ్చారు. మరి ముద్దుగుమ్మ.. ఫ్యూచర్ లో ఇంకెన్ని హిట్స్ అందుకుంటారో చూడాలి.




# 2వేల మందితో ఎస్‌డీఆర్ఎఫ్.. ప్రారంభించిన సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్: ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా రాష్ట్ర విపత్తు నిర్వహణ దళంను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో దాదాపు 2వేల మంది సిబ్బందితో ఏర్పాటైన ఎస్‌డీఆర్ఎఫ్.. భారీ అగ్ని ప్రమాదాలు, భూకంపం, వరదలు వంటి విపత్తులు సంభవించినప్పుడు అత్యవసరంగా సహాయక చర్యలు చేపట్టనుంది. అగ్నిమాపక కేంద్రాలు ఇక నుంచి ఎస్‌డీఆర్ఎఫ్ స్టేషన్లుగా మార్పు చెందనున్నాయి.

జులై, ఆగస్టు నెలల్లో సంభవించిన వరదలకు పలు ప్రాంతాలు నీటమునిగిన క్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి అత్యవసర సమీక్ష నిర్వహించారు. ఎన్‌డీఆర్ఎఫ్ తరహాలో సుశిక్షితులైన దళం అవసరమని భావించి ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ క్రమంలోనే ఎస్‌డీఆర్ఎఫ్‌ను తీర్చిదిద్దడంతో పాటు ఆధునికీకరించేందుకు ప్రభుత్వం రూ.35.03 కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులతో అధునాతన పరికరాలు, కొత్త అగ్నిమాపక వాహనాలు కొనుగోలు చేసి సిబ్బందికి ఎస్‌డీఆర్ఎఫ్ ప్రాథమిక కోర్సుల్లో శిక్షణ ఇప్పించారు.

అగ్నిమాపక శాఖకు చెందిన వెయ్యి మందికి తమిళనాడు లోని అరక్కోణం, మహారాష్ట్రలోని పుణే, గుజరాత్‌లోని వడోదరా, ఏపీలోని కృష్ణాజిల్లాలో ఉన్న ఎన్డీఆర్ఎఫ్ కేంద్రాల్లో శిక్షణ ఇప్పించారు.




హైదరాబాద్: గ్రూప్-1 అంశంలో రాష్ట్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టులో ఊరట లభించింది. గ్రూప్-1 నోటిఫికేషన్ రద్దు కుదరదని సర్వోన్నత న్యాయస్థానం తేల్చి చెప్పింది. నోటిఫికేషన్ రద్దు, మెయిన్స్ వాయిదా వేయాలని కోరుతూ వేసిన పిటిషన్‌ను కొట్టివేసింది. కొత్త నోటిఫికేషన్ చట్టవిరుద్ధమని కొందరు అభ్యర్థులు గతంలో హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ప్రిలిమ్స్‌లో 14 తప్పులున్నాయని పిటిషన్‌లో పేర్కొన్నారు. గ్రూప్-1 మెయిన్స్ వాయిదా వేయాలని హైకోర్టును కోరారు. అభ్యర్థుల పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది.

దీంతో హైకోర్టు తీర్పును సవాల్‌చేస్తూ అభ్యర్థులు సుప్రీంకోర్టుకు వెళ్లారు. పిటిషన్‌పై విచారణ జరిపిన జస్టిస్ నరసింహ నేతృత్వంలోని ధర్మాసనం శుక్రవారం తీర్పు వెలువరించింది. పిటిషనర్లు మెయిన్స్‌కు క్వాలిఫై కానందున మెయిన్స్ పరీక్ష వాయిదా వేయాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. పరీక్షల నిర్వహణలో కోర్టుల జోక్యం అనవసరమని ధర్మాసనం వ్యాఖ్యానించింది. కోర్టుల జోక్యంతో నియామకాల్లో తీవ్ర జాప్యం జరుగుతుందని అభిప్రాయపడింది. మెయిన్స్ నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇప్పటికే టీజీపీఎస్సీ గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు నిర్వహించింది. ఫిబ్రవరిలోగా మెయిన్స్ ఫలితాలు విడుదల చేస్తామని టీజీపీఎస్సీ తెలిపింది.

# అడ్డగోలుగా మాట్లాడటమే భారాస నేతలు పనిగా పెట్టుకున్నారు: భట్టి




హైదరాబాద్: పదేళ్ల భారాస పాలనలో ఉద్యోగులకు సకాలంలో జీతాలు ఇవ్వలేని పరిస్థితి ఉండేదని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. సచివాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. "భారాస రూ.7 లక్షల కోట్ల అప్పు చేసింది. మా ప్రభుత్వం వచ్చాక రూ.52 వేల కోట్ల అప్పు చేశాం. చేసిన అప్పులను తిరిగి బ్యాంకులకే కట్టే పరిస్థితికి తెచ్చారు. అప్పులకు అదనపు ఆదాయం కలిపి బ్యాంకులకు కట్టే పరిస్థితి వచ్చింది. సంక్షేమ పథకాలకు రూ.61వేల కోట్లు వెచ్చించాం. రైతు భరోసా, రుణమాఫీ, చేయూత, ఆరోగ్యశ్రీ పథకాలకు నిధులు కేటాయించాం. ప్రతి రోజు అడ్డగోలుగా మాట్లాడటమే భారాస నేతలు పనిగా పెట్టుకున్నారు. త్వరలోనే కొత్త విద్యుత్ విధానం ప్రకటిస్తాం. అందరూ వద్దంటున్నా.. భారాస ప్రభుత్వం భద్రాద్రి విద్యుత్ ప్రాజెక్టు కట్టింది. కేంద్రం జాప్యం వల్ల భద్రాద్రి ప్రాజెక్టుపై 42శాతం అదనపు భారం పెరిగింది. ప్రాజెక్టుపై పెరిగే ధరలన్నీ కలిపి అంతిమంగా ప్రజలపై భారం వేశారు. విద్యుత్ రంగం గురించి చాలా దుష్ప్రచారం చేశారు. మీరు చేసిన తప్పుడు ప్రచారాన్ని మేం సమర్థంగా తిప్పికొట్టాం. విద్యుత్ విషయంలో సమగ్ర వివరాలను ప్రజలముందుంచాం. గతేడాదికంటే విద్యుత్ డిమాండ్ పెరిగినా నాణ్యమైన విద్యుత్ ఇస్తున్నాం. మేం వచ్చాక విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు గుర్తించాం. ఉత్పత్తి కేంద్రాల సమాచారం అంతా ప్రజలకు చెప్పాం. థర్మల్ ఎనర్జీ వల్ల కాలుష్యం విపరీతంగా పెరుగుతోంది" అని భట్టి విక్రమార్క వివరించారు.

# కేటీఆర్.. తెలంగాణ కోసం మీరు చేసిన త్యాగం ఏమిటో చెప్పాలి: మహేశ్‌గౌడ్




హైదరాబాద్: పదేళ్ల భారాస పాలనలో 50వేల ఉద్యోగా లిస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తొమ్మిది నెలల్లోనే 50వేలకు పైగా ఉద్యోగాలు ఇచ్చిందని పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ తెలిపారు. గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్ని రంగాల్లో కాంగ్రెస్ మార్క్ పాలన కనిపిస్తోం దని, ప్రజాపాలన పండుగలో ప్రజలంతా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. "మా ప్రభుత్వం వచ్చాక ఆసుపత్రుల్లో సౌకర్యాలు మెరుగుపరుస్తున్నాం. పదేళ్ల భారాస పాలనలో మీరు చేసిన దోపిడీ ఇంతా అంతా కాదు. మళ్లీ అధికారంలోకి వస్తామని కేటీఆర్ పగటి కలలు కంటున్నారు. రూ.లక్షల కోట్లు కొల్లగొట్టిన మీకు మళ్లీ అధికారం ఎందుకిస్తారు?సామాన్యుడి పాలన ఈ రాష్ట్రంలో జరుగుతున్న నేపథ్యంలో.. తెలంగాణ ప్రజల యాస, భాష, కట్టుబాట్లు, సంస్కృతికి అద్దంపట్టే విధంగా తెలంగాణ తల్లి విగ్రహం ఉంటుంది. రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని తొలగిస్తామని కేటీఆర్ అంటున్నారు. రాజీవ్ చేసిన సేవల గురించి కేటీఆర్‌కు తెలియదా? దేశం కోసం ప్రాణాలర్పించిన కుటుంబం గురించి మాట్లాడే హక్కు మీకు లేదు. తెలంగాణ కోసం మీరు చేసిన త్యాగం ఏమిటో చెప్పాలి? పదేళ్ల పాటు తెలంగాణ సంపద దోచుకున్న కుటుంబం.. కేసీఆర్ కుటుంబం. భూములు, నిధులు, నియామకాల పేరుతో అడ్డంగా దోచుకున్నారు" అని విమర్శించారు.

# ఆ విషయంలో అంబేద్కర్ దార్శనికత మహోన్నతం

హైదరాబాద్, డిసెంబర్ 6: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ దేశానికి అందించిన సేవలను కొనియాడుతూ శుక్రవారం కేసీఆర్ ప్రెస్‌నోట్‌ను విడుదల చేశారు. సమ సమాజ నిర్మాణ దార్శనికుడు డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ అని అన్నారు. వివక్షకు వ్యతిరేకంగా తన జీవితకాలం పోరాడిన అంబేద్కర్ అజరామర కీర్తిని ప్రపంచానికి చాటేందుకు నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఎంతో కృషి చేసిందని.. అనేక విప్లవాత్మక కార్యక్రమాలను అమలు చేసిందని చెప్పుకొచ్చారు.

**తెలంగాణ ఏర్పాటుకు మార్గం...** బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా దేశానికి వారందించిన సేవలను, అనితర సాధ్యమైన కృషిని కేసీఆర్ స్మరించుకున్నారు. దేశ స్వాతంత్ర్య అనంతరకాలంలో ప్రపంచానికే ఆదర్శవంతమైన స్వయంపాలన కోసం రాజ్యాంగాన్ని అందించారని తెలిపారు. ఆర్థిక సామాజిక రాజకీయ సాంస్కృతిక తదితర రంగాల్లో అణగారిన వర్గాలకు సమాన వాటా సమన్యాయం దక్కేలా రాజ్యాంగాన్ని పొందుపరచడంలో బాబాసాహెబ్ కనబరిచిన దార్శనికత మహోన్నతమైనదని కొనియాడారు. దేశంలో రాష్ట్రాల ఏర్పాటులో భాగంగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పొందుపరిచిన ఆర్టికల్ 3, ఈ దిశగా వారి దార్శనికత తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు మార్గం చూపిందని గుర్తు చేశారు.

**అత్యంత ఎత్తులో విగ్రహం..** అంబేద్కర్ విశేష కృషిని, ఆయన అందించిన స్ఫూర్తిని చాటేందుకు ప్రపంచంలోనే అత్యంత మహోన్నతమైన రీతిలో అంబేద్కర్ స్ఫురద్రూపాన్ని తెలంగాణాలో అత్యంత ఎత్తయిన విగ్రహంగా నిలుపుకున్నామన్నారు. దేశ పాలనకు తన రాజ్యాంగం ద్వారా బాటలు వేసిన అంబేద్కర్ ఘనమైన కీర్తిని చాటేందుకు దేశ చరిత్రలోనే మునుపెన్నడూ లేనివిధంగా తెలంగాణ పాలనా భవనానికి "డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ స్టేట్ సెక్రటేరియట్" అని పేరు పెట్టుకున్నామని తెలిపారు.




తెలంగాణ తల్లి విగ్రహంపై రాజకీయ వివాదం నడుస్తోంది. ప్రస్తుతం ఉన్న విగ్రహం రూపాన్ని మారుస్తూ.. కొత్త విగ్రహాన్ని ఈనెల9వ తేదీన ఆవిష్కరించేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధమైంది. దీంతో బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య కొద్దిరోజులుగా మాటల యుద్ధం నడుస్తోంది. తెలంగాణ తల్లి విగ్రహాన్ని దొరసానిలా రూపొందించారని కాంగ్రెస్ విమర్శిస్తుంటే.. కేసీఆర్ ఆనవాళ్లు చెరిపేసేందుకు కాంగ్రెస్ కుట్ర చేస్తోందని, దీనిలో భాగంగా తెలంగాణ తల్లి రూపాన్ని మార్చాలనే ప్రయత్నం చేస్తోందని బీఆర్ఎస్ ఆరోపిస్తోంది. ఓ సాధారణ మహిళలా తెలంగాణ తల్లిని రూపొందిస్తున్నామని కాంగ్రెస్ చెబుతుండగా.. తెలంగాణ తల్లి రూపం ధనిక మహిళగా ఉంటే వచ్చే నష్టం ఏమిటని బీఆర్ఎస్ ప్రశ్నిస్తోంది. మరో మూడు రోజుల్లో కొత్త తెలంగాణ తల్లి రూపాన్ని ఆవిష్కరించనున్న నేపథ్యంలో కొత్త విగ్రహానికి సంబంధించిన రూపం బయటకు వచ్చింది. ఓ సాధారణ మహిళను తలపించేలా విగ్రహం ఉండగా.. గత విగ్రహానికి ప్రస్తుత విగ్రహానికి పోలికల్లో ఎన్నో తేడాలు ఉన్నాయి. ప్రభుత్వాలు మారినప్పుడల్లా విగ్రహం రూపాలను మార్చడం సరికాదని బీజేపీ అంటోంది. ఇటీవల తెలంగాణ గేయం విషయంలోనూ వివాదం నెలకొన్నప్పటికీ తెలంగాణ ప్రభుత్వం పాత గేయం స్థానంలో కొత్త గేయాన్ని తీసుకొచ్చింది. తాజాగా తెలంగాణ తల్లి విగ్రహం విషయంలోనూ కాంగ్రెస్ ప్రభుత్వం గత రూపాన్ని మారుస్తూ ఓ సాధారణ మహిళ రూపాన్ని తలపించేలా కొత్త రూపాన్ని రూపొందించింది.

**అప్పటికీ.. ఇప్పటికీ తేడాలివే..** పాత తెలంగాణ తల్లి విగ్రహంలో తెలంగాణ తల్లి జరీ అంచు పట్టు చీర ధరించగా.. కొత్త విగ్రహంలో పసుపు పచ్చ అంచుతో ఆకుపచ్చ చీర ధరించి ఉంది. పాత విగ్రహంలో తలకు కిరీటం, చేతిలో బతుకమ్మ ఉండగా.. కొత్త విగ్రహంలో కిరీటం, చేతిలో బతుకమ్మ లేదు. గత విగ్రహంలో తెలంగాణ తల్లి చేతికి బంగారు గాజులు ఉండగా, ప్రస్తుతం మట్టి గాజులు ధరించి తెలంగాణ తల్లి విగ్రహం కనిపిస్తోంది. గత విగ్రహం రాజమాతలా ఉందనే విమర్శలు రాగా.. కొత్త విగ్రహం సాధారణ మహిళ రూపాన్ని తలపిస్తోంది. పాత విగ్రహంలో వెండి మెట్టెలు, నగలు కిరీటం ఉండగా.. కొత్త విగ్రహంలో మెడలో కంటి ఆభరణం మాత్రమే కనిపిస్తోంది. పాత విగ్రహంలో కుడి చేతిలో మక్క కంకులు ఉండగా.. కొత్త విగ్రహం కుడి చేతిలో అభయ హస్తం కనిపిస్తోంది. పాత విగ్రహంలో ఎడమ చేతిలో బతుకమ్మ ఉండగా.. కొత్త విగ్రహంలో ఎడమ చేతిలో వరి, జొన్న, సజ్జ కంకులు ఉన్నాయి. రెండు విగ్రహాల రూపాలకు స్పష్టమైన తేడా కనిపిస్తోంది.




హైదరాబాద్: రాజ్యాంగ స్ఫూర్తిని ప్రధాని నరేంద్రమోదీ సమున్నతంగా కాపాడుతున్నారని భాజపా ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా భాజపా రాష్ట్ర కార్యాలయం లో నివాళులర్పించిన అనంతరం ఈటల మాట్లాడారు. ఈ దేశంలో ఉత్పత్తి అయిన సమస్త సంపద.. సమస్త ప్రజల అవసరాలను తీర్చాలని చెప్పిన మహనీయుడు అంబేడ్కర్ అని కొనియాడారు.

ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నుకున్న ప్రభుత్వాలు ప్రజలకు సేవకులుగా ఉండాలని చెప్పారన్నారు. వర్ధంతి సందర్భంగా ఆ మహనీయుడి ఆశయాలను గుర్తు చేసుకొని అమలు చేయడానికి కృషి చేయాలని కోరారు. "రాష్ట్ర ప్రభుత్వం మోసపూరిత హామీలతో ప్రజలను దగా చేస్తోంది.

ప్రజలకు ఏం చేశారని సంబరాలు చేసుకుంటున్నారు. ప్రజాక్షేత్రంలో ప్రభుత్వ వైఫల్యాలు ఎండగడతాం. సీఎం రేవంత్‌రెడ్డి ఏం సాధించారని అన్ని వర్గాలు ప్రశ్నిస్తున్నాయి. హోదా, స్థాయి మరిచి ఆయన చిల్లర మాటలు మాట్లాడుతున్నారు. కిషన్‌రెడ్డికి డీఎన్‌ఏ పరీక్ష జరగాలన్న వ్యాఖ్యలకు శిక్ష తప్పదు. కాంగ్రెస్ దుర్మార్గాలను ఖండిస్తూ నిర్వహించే సభకు ముఖ్య అతిథిగా భాజపా జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా హాజరవుతారు" అని ఈటల రాజేందర్ చెప్పారు.

# దళితబంధు డిమాండ్ చేస్తున్న వారిపై దండిగా కేసులు: కేటీఆర్



హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల స్వేచ్ఛను హరిస్తోందని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా తెలంగాణ భవన్‌లో నివాళులర్పించిన అనంతరం ఆయన మాట్లాడారు. అంబేడ్కర్‌ను కాంగ్రెస్ పార్టీ అవమానిస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్బంధిస్తోంది భారాస నేతలను కాదని.. అంబేడ్కర్‌ను అని పేర్కొన్నారు. "భారాస హయాంలో సచివాలయానికి ఆయన పేరు పెట్టి గౌరవించుకున్నాం. 125 అడుగుల విగ్రహాన్ని ఏర్పాటు చేశాం. ప్రస్తుతం అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా నివాళులర్పించకుండా అడ్డుకుంటున్నారు. ఆయన విగ్రహాన్ని నిర్లక్ష్యం చేయడం వెనుక మీ ఉద్దేశమేంటి? దళితబంధు తొలగించి అంబేడ్కర్ అభయహస్తం తెస్తామన్నారు. ఇప్పుడు దాని ఊసేలేదు. దళితబంధు డిమాండ్ చేస్తున్న వారిపై దండిగా కేసులు పెడుతున్నారు" అని కేటీఆర్ విమర్శించారు.

# నిరసనలకు పిలుపునిచ్చిన భారాస.. ఆ పార్టీ ఎమ్మెల్యేల గృహనిర్బంధం

హైదరాబాద్: భారాస ఎమ్మెల్యేలు, నేతల అరెస్టులను ఖండిస్తూ ఆ పార్టీ నిరసనలకు పిలుపునిచ్చింది. ఎన్టీఆర్ మార్గ్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపేందుకు నేతలు సిద్ధమయ్యారు. ఈక్రమంలో పోలీసులు అప్రమత్తమయ్యారు.

మాజీ మంత్రి హరీశ్‌రావు, భారాస ఎమ్మెల్యేలు, నేతల నివాసాల వద్ద పోలీసులు భారీగా మోహరించారు. కొంపల్లిలో కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద, కూకట్‌పల్లిలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావును గృహ నిర్బంధం చేశారు. మేడ్చల్ జిల్లా దుండిగల్ మండలంలోని నివాసంలో ఆ పార్టీ నేత శంభీపూర్ రాజు, కొండాపూర్‌లో ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్, రాజేంద్రనగర్ బండ్లగూడలో ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను హౌస్ అరెస్టు చేశారు. మరోవైపు తెలంగాణ భవన్ వద్ద పోలీసులు మోహరించారు.



# ఇది.. నీ నిరంకుశ, నియంతృత్వ పాలనకు నిలువుటద్దం

హైదరాబాద్, డిసెంబర్ 6: అక్రమ నిర్బంధాలు, అరెస్టుల పట్ల మాజీ మంత్రి హరీష్‌రావు ఫైర్ అయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను ఎక్కడికక్కడ అరెస్టులు, నిర్బంధాలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని ఎక్స్ వేదికగా మాజీ మంత్రి పోస్టు చేశారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా నివాళులర్పించేందుకు వెళ్ళనివ్వకుండా ఈ నిర్బంధాలు ఎందుకని ప్రశ్నించారు. "ఇది నీ నిరంకుశ, నియంతృత్వ పాలనకు నిలువుటద్దం. ఒకవైపు ప్రజా పాలన విజయోత్సవాలు అని ప్రచారం చేసుకుంటూ, మరోవైపు రాష్ట్రంలో అప్రకటిత ఎమర్జెన్సీని ప్రకటించావు. మీ అప్రజాస్వామిక విధానాలు, రాజ్యాంగ ఉల్లంఘనలకు పాల్పడుతున్న వైఖరిని చూసి హైదరాబాద్ నడిగడ్డపై ఉన్న అంబేద్కర్ సైతం నివ్వెరపోతున్నడు. అదుపులోకి తీసుకున్న మా పార్టీ నాయకులు, కార్యకర్తలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నాం" అంటూ హరీష్ రావు ఎక్స్‌లో పోస్టు చేశారు. కాగా.. కాంగ్రెస్ ప్రభుత్వ అక్రమ అరెస్టలకు నిరసగా ఈరోజు రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనకు బీఆర్ఎస్ పార్టీ పిలుపునిచ్చింది. ఎన్టీఆర్ మార్గ్‌లో ఉన్న 125అడుగుల అంబేద్కర్ విగ్రహం వద్ద ఈరోజు బీఆర్ఎస్ నిరసన చేపట్టాలని నిర్ణయించారు. నిరసన కార్యక్రమంలో గులాబీ పార్టీ ముఖ్య నేతలు పాల్గొననున్నారు. ప్రశ్నించిన వారిని అరెస్ట్ చేస్తూ.. రేవంత్ సర్కార్ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోందని బీఆర్ఎస్ మండిపడుతోంది. కేసీఆర్ కట్టించిన అంబేద్కర్ విగ్రహం వద్దకు వెళ్ళే అవకాశం కల్పించాని బీఆర్ఎస్ డిమాండ్ చేసింది.. అయితే బీఆర్ఎస్ ఆందోళనల నేపథ్యంలో పోలీసులు ముందస్తు అరెస్టులు చేపట్టారు. బీఆర్ఎస్ నిరసన పిలుపుపై అలర్ట్ అయిన పోలీసులు.. పలువురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేల నివాసాల వద్ద బందోబస్త్ నిర్వహించారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, RNI Regd. No. TELTEL/2023/86207, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com